RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 277 మేడ్చల్ మల్కాజ్‌గిరి 29 అక్టోబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## ఆగని బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. 50కిపైగా విమానాలతోపాటు తిరుపతి, లక్నోలోని పలు హొటళ్లకు బెదిరింపులు వచ్చాయి. భద్రతా నిబంధనల మేరకు రెండు విమానాలను దారి మళ్లించారు. మిగిలిన వాటిలో తనిఖీలు చేపట్టి ఎటువంటి ప్రమాదం లేదని తేల్చారు. దీంతో గత రెండు వారాల్లో బెదిరింపులు వచ్చిన విమానాల సంఖ్య 350 దాటింది. తిరుపతిలో మూడు రోజులుగా హొటళ్లకు వస్తున్న బాంబు బెదిరింపులు ఆదివారం కూడా కొనసాగాయి. ఇప్పటి వరకూ ఆరు హొటళ్లకు హెచ్చరికలు రాగా ఆయా హొటళ్లకు వెళ్లి, వాటిని ఖాళీ చేయించి, బాంబు నిర్వీర్య దళంతో తనిఖీలు చేసి ఏమీ లేవని తేల్చారు. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం సహా ఇస్కాన్ టెంపుల్‌కు కూడా బాంబులు పెట్టినట్టు సమాచారం రావడంతో అధికారులు పరుగులు పెట్టారు. ఎటువంటి ప్రమాదకరమైన వస్తువులు కనిపించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వర్గానికీ మేలు చేయలేదు: హరీశ్‌రావు




హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వర్గానికీ మేలు చేయలేదని.. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేపోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రం లో అన్ని జిల్లాల్లోనూ ధర్నాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పథకాలను కూడా సీఎం రేవంత్ కొనసాగించలేకపోతున్నారని.. బతుకమ్మ చీరలను సైతం ఇవ్వలేకపోయారని హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా తమ ప్రభుత్వ హయాంలో రైతుల కోసం రైతు బంధు ఇచ్చామన్నారు. అధికారంలోకి వస్తే రైతులకు రూ. 15వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్.. గతంలో ఉన్న రూ. 10వేలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. పత్తికి మద్దతు ధర రాకపోయినా సీఎం, మంత్రులు నోరుమెదపడం లేదన్నారు. అకాల వర్షాలతో ఇప్పటికే పత్తి రైతులు ఇబ్బందుల్లో ఉంటే గోరుచుట్టుపై రోకలిపోటులా వారికి మద్దతు ధర కూడా లేదని విమర్శించారు. ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మంలో రైతులు రోడ్డెక్కినా.. ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో మక్కల కొనుగోలు కేంద్రాలే ప్రారంభం కాలేదన్నారు. వడ్ల కొనుగోలుకు మంత్రులు కొబ్బరికాయలు కొట్టుడే తప్ప.. వాటిని కొనే దిక్కులేదని విమర్శించారు.
వడ్లకు రూ. 2,320 మద్దతు ధర రావాల్సి ఉండగా.. రూ. 1800 నుంచి రూ. 1900కే రైతులు అమ్ముకుంటున్న పరిస్థితి వచ్చిందన్నారు. పత్తికి రూ. 7,521 మద్దతు ధర రాకపోవడంతో రూ. 5,000 – రూ. 5,500కే విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.




## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..
## సీఎం సెక్యూరిటీలో కీలక మార్పులు..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసులు బెటాలియన్ పోలీసుల నిరసనలు, ధర్నాలతో హోరెత్తిస్తుండడంతో ఇంటెలిజెన్స్ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీలో ఉన్నతాధికారులు కీలక మార్పులు చేశారు. ముఖ్యమంత్రి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ టీజీఎస్పీ పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి పెద్దఎత్తున నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో నిరసనలు చేస్తూ నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ క్రమశిక్షణా చర్యల పేరుతో 39 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను శనివారం నాడు పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆదివారం నాడు ఏఆర్ ఎస్సై, మరో హెడ్ కానిస్టేబుల్ సహా ఏకంగా 10 మందిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ వీరి ఆందోళనలు మాత్రం ఆగడం లేదు. తమకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని బెటాలియన్ పోలీసులు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరిలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రతా సిబ్బందిని మార్చివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

అప్పుడు ఉన్న భద్రతా సిబ్బందిలో ఎక్కువ మంది గత సీఎం కేసీఆర్ వద్ద పని చేసిన వారే. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం, ఆయనకు సంబంధించిన వ్యక్తిగత, అధికారిక సమాచారం బయటకు వెళ్తోందని మార్పులు చేశారు. పాత వారిని తొలగిస్తూ కొత్త భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. అయితే సమాచారం బయటకు వెళ్లడంపై సీఎంవో, ఇంటెలిజెన్స్ అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అప్పుడు భారీగా మార్పులు చేశారు. అలాగే ప్రస్తుతం టీజీఎస్పీ పోలీసుల నిరసనల నేపథ్యంలో ఉన్నతాధికారులు ముందుగానే అప్రమత్తం అయ్యారు.




# బుల్డోజర్ సైరన్

## రేవంత్ ఇక ఆగేట్లు లేరు..

## అధిష్టానం ఫుల్ సపోర్ట్..!!

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ నది ప్రక్షాళనను సవాల్ గా తీసుకున్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభించడానికి ఆయన రెడీ అయిపోతున్నారు. అందుకే హైడ్రాకు ఆయన అన్ని అధికారులు చట్టబద్ధంగా కట్టబెడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలే కాకుండా హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం పది వేల భవనాలను ఖాళీ చేయించే యోచనలో రేవంత్ రెడ్డి ఉన్నట్లే కనపడుతుంది. హైకమాండ్ నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ లభించడంతోనే రేవంత్ రెడ్డి ఇటీవల నేరుగా మీడియా సమావేశంలో ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టేశారు. తాను చెప్పదలచుకున్నది చెప్పేశారు. మూసీ పునరుజ్జీవానికి...మీరు చెప్పినట్లే చేస్తానని ఒక పక్క అంటూనే మూసీ పునరుజ్జీవం చేయాల్సిందేనని ఆయన నొక్కి చెప్పడంతో ఢిల్లీ పెద్దలు కూడా రేవంత్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కనపడుతుంది. ఇటీవల వాయనాడ్‌లో ప్రియాంక గాంధీ నామినేషన్ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతో భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం రేవంత్‌కు ఫుల్ పవర్స్ ఇచ్చినట్లుగా పార్టీలే వెల్లడిస్తున్నాయి. మూసీ ప్రాజెక్టు సుందరీకరణ చేపట్టడమే కాకుండా భవనాలు కోల్పోయిన వారందరికీ పరిహారం అదే స్థాయిలో ఇస్తామని ప్రకటించడం కూడా ఆయన వెనకడుగు వేయనని చెప్పడానికి ఒక కారణంగా చూడాలంటున్నారు. విపక్షాల నోళ్లు మూసివేయిం చేందుకే మరీ ఛాలెంజ్ లు విసిరారు. ప్రజల బాగోగుల కోసమే తాను చేస్తున్నానని చెప్పుకొచ్చారు. టూరిజం అభి వృద్ధి చెందితే రాష్ట్రం కూడా ఆర్థికంగా పురోభివృద్ధి చెందుతుందన్నారు. దీనికి తోడు హైదరాబాద్ పరిధిలో నాలుగో నగరం ఏర్పాటుకు కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని రేవంత్ రెడ్డి గట్టిగా భావిస్తున్నట్లే కనిపిస్తుంది. హైకోర్టు కూడా...అందుకే ఆయన తగ్గేటట్లు కనిపించడం లేదు. హైకోర్టు కూడా హైడ్రాకు అనుకూలంగా తీర్పు చెప్పడం శుభపరిణామంగా భావిస్తున్నారు. మంచి ఆలోచనకు చేయూతనివ్వాలని, విమర్శలను పక్కన పెట్టి తనకు అండగా నిలవాలని రేవంత్ రెడ్డి కోరారు. పదివేల ఇళ్లను ఖాళీ చేయించడం అంటే మాటలు కాదు. చాలా మంది ఇళ్ల యజమానులు ఇప్పటికే న్యాయస్థానాలను ఆశ్రయించారు. స్టే ఆర్డర్‌లు కూడా తెచ్చుకుని ఇళ్లకు తమకు కోర్టు ఆర్డర్ ఉందంటూ ఫ్లెక్సీలు కూడా పెట్టుకున్నారు. అవన్నీ భారీ భవంతుల దగ్గర నుంచి పూరి ఇళ్ల వరకూ ఉన్నాయి. మరి ఏ ఇళ్లను కూలగొడతారో స్పష్టత లేదు కానీ త్వరలోనే ఈ ప్రక్రియను ప్రారంభించే అవకాశముంది. ముహూర్తం కోసమే...పరిహారం కూడా భారీ స్థాయిలోనే వారికి ప్రకటించేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారంటే మూసీ ప్రాజెక్టును ప్రెస్టేజ్ గా తీసుకున్నారు. త్వరలో అసెంబ్లీ సమావేశాలు పెట్టి దీనిపై స్పష్టత ఇచ్చే ఆలోచనలో రేవంత్ రెడ్డి ఉన్నారు. నోటీసులు ముందుగా ఇవ్వడం, కోర్టులను ఆశ్రయిస్తే వాటిని ఖాళీ చేయించడంతో పాటు నిర్వాసితులకు నచ్చ చెప్పేందుకు కూడా ప్రత్యేకంగా టీంలను రేవంత్ రెడ్డి రెడీ చేస్తున్నట్లు తెలిసింది. కొన్ని ఆక్రమణలను తొలగించినా కొంత అసంతృప్తి తలెత్తినా, నగరంలో అత్యధిక శాతం మంది తమకు అండగా నిలుస్తారన్న అభిప్రాయాన్ని రేవంత్ రెడ్డి బలంగా విశ్వసిస్తున్నట్లుంది.అందుకే ముందుకే అడుగు వేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. మరి ముహూర్తం ఎప్పుడనేది చూడాల్సి ఉంది.

# ఓడలు బండ్లయ్యాయి...
# బండ్లు ఓడలయ్యాయి..!

## రసవత్తరంగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు..!!




## కేసీఆర్ నిర్ణయంతో బరిలోకి ఎంఆర్ఎస్..!

హైదరాబాద్ : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి గులాబీ పార్టీ దూరమైంది. గులాబీ పార్టీ పోటీ చేయడం లేదన్న సంకేతాలు ఇవ్వడంతో మహారాష్ట్రకు చెందిన ఆ పార్టీ నేతలు మహారాష్ట్ర రాజ్యసమితి పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీ అవుతున్నారు. మహారాష్ట్ర పరివర్తన్ ఫ్రంట్ పేరుతో వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు ఒక్కటిగా ఎన్నికల బరిలో ఉండాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని భావించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ రాష్ట్ర సమితి పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చారు. ఆ తర్వాత జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోవటంతో ఇక జాతీయ రాజకీయాలపై ఏ మాత్రం ఫోకస్ పెట్టడం లేదని టాక్. మహారాష్ట్ర పై కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఆ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని ఏర్పాట్లు కూడా చేశారు. రైతు సమస్యలే ప్రధాన అజెండాగా ప్రస్తావిస్తూ రైతు సంఘాలను ఏకతాటిపైకి తెచ్చారు. గతంలో గులాబీ పార్టీ మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు చేపట్టింది. నెల రోజుల పాటు జరిగిన ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో దాదాపు 20 లక్షల మంది గులాబీ పార్టీలో చేరారు. ఆ తర్వాత తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలైంది. మూడోసారి అధికారంలోకి వస్తామని భావించినా.. అధికారం దక్కపోవడంతో కేసీఆర్ జాతీయ రాజకీయాలవైపు చూడటం లేదట. దాదాపు ఏడాదిన్నర పాటు మహారాష్ట్ర రాజకీయాల్లో హల్ చల్ చేసిన మహా గులాబీ నేతలు.. కేసీఆర్ నిర్ణయంతో ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి కేసీఆర్.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై నిర్ణయం తీసుకుంటారని భావించినా వారికి నిరాశే ఎదురైంది. బీఆర్ఎస్ లో చేరిన ఎంతో మంది వివిధ పార్టీల నేతల్లో కొందరు ప్రధాన రాజకీయ పార్టీల్లో చేరిపోగా, మరికొందరు ఒకటిగా చేరి మహారాష్ట్ర రాజ్యసమితి పేరుతో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది.

అదే విధంగా మహా రాజకీయాల్లో రైతు సంఘాల పాత్ర కీలకం కావడంతో రైతు సంఘాల నేతలంతా మహారాష్ట్ర పరివర్తన్ ఫ్రంట్ పేరుతో ఒక్కటయ్యారు. ఫ్రంట్ లో కీలక పాత్ర పోషిస్తూనే 80 నియోజకవర్గాల్లో మహారాష్ట్ర రాజ్యసమితి అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండాలన్న లక్ష్యంగా అడుగులు వేస్తున్నారట.

# సంపాదకీయం

## అక్కడ శాంతిభద్రతలు భేష్

## భారత్ కంటే బెటర్ గా 78 దేశాలు!

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో భారీ యుద్ధాలు జరుగుతున్నాయి. 2022లో మొదలైన రష్యా – ఉక్రెయిన్ వార్ అవిరామంగా కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు ఈ యుద్ధంలోకి రష్యా తరుపున ఉత్తర కొరియా కూడా ఎంట్రీ ఇచ్చింది. ఇక ఇజ్రాయెల్ – హమాస్ లతో మొదలైన యుద్ధం నేడు ఇరాన్ వరకూ వ్యాపించింది. ఈ క్రమంలో ఇప్పటికే గాజా అల్లకల్లోలమవ్వగా, ఇప్పుడు లెబనాన్ పరిస్థితి అదే అని అంటున్నారు. ఇలా పశ్చిమాసియాలో తీవ్ర భయానక వాతావరణ నెలకొంది. మూడో ప్రపంచ యుద్ధ మాటలు కూడా వినిపిస్తున్నాయి. ఈ సమయంలో... శాంతిభద్రతల విషయంలో బెస్ట్ గా ఉంటూ ప్రశాంతంగా ఉండే దేశాల జాబితా తాజాగా విడుదలైంది. అవును... ప్రపంచ వ్యాప్తంగా లా అండ్ ఆర్డర్ లో బెస్ట్ ప్లేస్ లో పలు దేశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా 142 దేశాలకు ర్యాంకులు ఇచ్చారు. ఈ సమయంలో ఆయా దేశాలకు ర్యాంకులు ఇవ్వడానికి వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూల్ ఆఫ్ లా ఇండెక్స్ లోని ఎనిమిది అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. ఈ క్రమంలోనే ర్యాంకులను నిర్ధారిస్తారు. ఇందులో భాగంగా... బహిరంగ ప్రభుత్వాన్ని కలిగి ఉండటం, ప్రభుత్వ అధికారంపై స్వాభావిక తనిఖీలను నిర్వహించడం, అవినీతి లేకపోవడం, ప్రాథమిక హక్కులను నిర్ధారించడం, ఆర్డర్ – భద్రతకు మద్దతు ఇవ్వడం, నిబంధనలను అమలు చేయడం, పౌర న్యాయాన్ని నిర్వహించడం, నేర న్యాయాన్ని సమర్థించడం వంటి అంశాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో తాజాగా వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూపొందించిన సూచీ ప్రకారం ఈ జాబితాలో డెన్మార్క్ అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో నార్వే, మూడో స్థానంలో ఫిన్లాండ్ ఉన్నాయి. ఇక అగ్రరాజ్యం అమెరికా ఈ జాబితాలో 26వ ర్యాంక్ దక్కించుకోగా యునైటెడ్ కింగ్ డమ్ 15 స్థానంలో యూఎస్ కంటే బెటర్ గా ఉంది.

ఇదే సమయంలో ఈ జాబితాలో భారతదేశం ర్యాంకు 79గా ఉండగా.. దాయాది దేశం పాకిస్థాన్ 129వ స్థానంలో ఉంది. ఇక అన్నింటికంటే చివరిగా 142వ స్థానంలో వెనిజులా ఉందని ఈ నివేదిక తెలిపింది.

**వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ లో టాప్ 10 దేశాలు!:** డెన్మార్క్, నార్వే, ఫిన్లాండ్, స్వీడన్, జర్మనీ, న్యూజిలాండ్, లగ్జెంబర్గ్, నెథర్లాండ్స్, ఐర్లాండ్, ఎస్టోనియా

# మూడు నెలలవుతున్నా ముందుకు కదలరేం?



గోదావరిఖని: కార్మికుల పిల్లలకు సింగరేణి యాజమాన్యం జారీచేసిన వయోపరిమితి పెంపు అమలు కావడం లేదు. దీంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కరోనా సమయంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ పరీక్షలు నిర్వహించడం ఆలస్యం కావడంతో వారి వయోపరితి దాటిపోయింది. దీన్ని ప్రత్యేక పరిస్థితుల కింద గుర్తించి 35 నుంచి 40 ఏళ్లకు వయోపరిమితిని పెంచుతూ యాజమాన్యం ఆదేశాలు జారీచేయగా.. అమలు కావడంలో మాత్రం ఆలస్యం జరుగుతోంది.

40 ఏళ్లు కూడా దాటిపోతున్నాయి!

ఇప్పటికే నాలుగేళ్లు నిరీక్షించగా.. దీంతో 40 సంవత్సరాల వయోపరిమితి కూడా దాటిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. కొవిడ్–19 సమయంలో రెండేళ్లపాటు మెడికల్ పరీక్షలు నిర్వహించలేదు. కరోనా ముగిసిన రెండేళ్లకు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేశారు. అప్పటికే కొంతమంది వారసులకు 35 ఏళ్లు దాటిపోయాయి. దీంతో వారిని ఉద్యోగానికి తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టారు. దీనికి యాజమాన్యం ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించి 40 ఏళ్లకు వయోపరిమితిని సవరిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

జారీచేసి 3 నెలలు గడిచినా..

వయోపరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసి మూడు నెలలు గడిచిపోయింది. ఈ ఏడాది జూన్‌లో ఆదేశాలు జారీ చేసిన యాజమాన్యం.. పెండింగ్‌లో ఉన్న వారసులు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. దీంతో కార్మికుల పిల్లలు వారి తండ్రులు పనిచేసిన కార్యాలయాల్లో తమ వివరాలు అందజేశారు. అయితే మూడు నెలలు గడుస్తున్నా ఉద్యోగాలకు సంబంధించిన చర్యలు చేపట్టలేదు. దరఖాస్తు చేసుకున్నవారిని ఎప్పుడు పిలుస్తారా అని ఎదురుచూస్తున్నారు.

1500 మందికి నిలిపివేత..

సింగరేణి వ్యాప్తంగా 1500 మంది వారసులకు వయోపరిమితి పెరిగిన కారణంగా ఉద్యోగాల్లోకి తీసుకోకుండా నిలిపివేశారు. వారికి ప్రత్యేకంగా జారీ చేసిన ఆదేశాలతో ఉద్యోగానికి మార్గం సుగుమం అయిందనే సంతోషం వ్యక్తమైనా.. మళ్లీ మూడు నెలలుగా జాప్యం చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన యాజమాన్యం.. దరఖాస్తు చేసుకున్న కార్మికుల పత్రాలు కార్పొరేట్ వరకు మాత్రమే వెళ్లాయి. అక్కడి నుంచి మార్గదర్శకాలు వస్తేనే మిగతా ప్రక్రియ మొదలు పెడతామన్న సమాధానాలు కార్యాలయాల సిబ్బంది నుంచి వినిపిస్తోంది.

# ఫిర్యాదులు వచ్చే వరకు ఆగకండి..



సిరిసిల్ల: విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన గురువుల్లో కొందరి తీరు ఆ వృత్తికే కళంకం తెచ్చేలా ఉంది.. కొన్నిచోట్ల విద్యార్థులు కూడా తోటి విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. ఫిర్యాదు చేస్తే ఏమవుతుందోనని చాలామంది విద్యార్థినులు మిన్నకుండిపోతున్నారు. పరిస్థితి విషమించినప్పుడు తమ ఆవేదనను వెళ్లగక్కుతున్నారు.. వసతి గృహాలు, గురుకులాల్లో పరిస్థితి మరోలా ఉంది. విద్యార్థినులు ఫోన్ చేయాలంటే అందులో పనిచేసే సిబ్బంది ఫోన్‌ని ఉపయోగించాలి. దీంతో వారు ఎదుర్కొంటున్న సమస్యను ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుట చెప్పలేకపోతున్నారు. తల్లిదండ్రులు సందర్శనకు వచ్చినపుడే ఇలాంటి విషయాలు ఎక్కువ శాతం వెలుగులోకి వస్తున్నాయి.

విద్యార్థినులు, యువతులు, మహిళల రక్షణే ధ్యేయంగా షీ బృందాలు పని చేస్తున్నాయి. ఈ బృందాలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే అవగాహన కార్యక్రమాలు పట్టణ ప్రాంతాలకే ఎక్కువగా పరిమితమవుతున్నాయి. దీంతో విద్యార్థినులు తమ ఆవేదన చెప్పుకోవడానికి అవకాశం లేకుండా పోతుంది. ఇప్పటికైనా అవగాహన కార్యక్రమాలు పెంచి విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడితే వారిపై అనుచితంగా ప్రవర్తిస్తున్నవారి వివరాలు బయటపడే అవకాశం ఉంది.

సెప్టెంబర్ 12 2024

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి పాఠశాలలోని విద్యార్థినుల పట్ల ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయం గత వెలుగులోకి వచ్చింది. విద్యార్థినుల తల్లిదండ్రులు ఓ ఉపాధ్యాయుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదైంది. విద్యాశాఖ విచారణ జరుగుతోంది.

సెప్టెంబర్ 12 2024

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గిరిజన గురుకుల పాఠశాల మహిళా పీఈటీ విద్యార్థినులతో వ్యవహరించిన తీరుపై గత గురువారం ఆందోళన చేశారు. ఇష్టం వచ్చినట్లు కొట్టడంతోపాటు వీడియోలు తీస్తున్నారని ఆరోపించారు..

డిసెంబర్ 2022

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థినులు గతేడాది వేధింపులపై అప్పటి కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో సఖి సిబ్బంది, షీ బృందం పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడగా ఓ ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన వెలుగులోకి వచ్చింది. ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ఈ ఏడాది జనవరిలో సిరిసిల్ల పట్టణంలోని ఓ ఉన్నత పాఠశాలలో సామాజిక మాధ్యమాల్లో విద్యార్థినుల ఫొటోలను మార్ఫింగ్ చేసి వాటితో అసభ్యంగా ఛాటింగ్ చేస్తున్న విషయం వెలుగు చూసింది.. దీనిపై బాధితులు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేశారు. వారు పాఠశాలకు వెళ్లి విచారించగా అదే పాఠశాలలోని విద్యార్థులు ఈ పని చేసినట్లు గుర్తించారు. విద్యార్థులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో) అత్యంత కఠినమైనది. బాధితుల వాగ్మూలంతో నమోదయ్యే కేసులో 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. దీనిపై విస్తృత ప్రచారం కల్పిస్తే వికృత చేష్టలు చేయడానికి జంకుతారు. ఒక్కసారి కేసు నమోదైతే ఉద్యోగావకాశాలు కోల్పోతారు.

ఉమ్మడి జిల్లాలో చిన్నారులపై అఘాయిత్యాలు వాటిపై నమోదయ్యే కేసులు ఏటా పెరుగుతున్నాయి. 2023లో పోక్సో కేసులు 146 నమోదవగా ఈ ఏడాది ఇప్పటికీ 89 కేసులు నమోదయ్యాయి. అవగాహనతో బయటకు వచ్చి ఫిర్యాదు చేస్తున్న వారు కొందరైతే.. సమాజానికి భయపడి లోపలే కుమిలిపోయే వారు మరెందరో.. పాఠశాలల్లోనే కాదు బయటకూడా చిన్నారులపై ఆకృత్యాలు ఎక్కువే ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలోని సఖి కేంద్రాలు, షీ బృందాలు పాఠశాలల మొదలు ఇంజినీరింగ్, వైద్య కళాశాలల వరకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాలి. స్థానిక పోలీసులు, షీ బృందాల చరవాణి నంబర్లు ప్రతి విద్యాసంస్థలో కనిపించేలా అతికించాలి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటిలోనూ సఖి, షీ బృందాలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం చెప్పారు. పోలీసుశాఖ సహకారం తీసుకుంటామన్నారు.

# సాగుకు డ్రోన్ల 'సహకారం'

కరీంనగర్ : ఆధునిక సేద్యానికి రైతులు ముందుకొస్తున్న తరుణంలో వారికి అవసరమైన తోడ్పాటునిస్తున్నామని.. ఎకరాల కొద్దీ ఎరువులను చల్లేందుకు వీలుగా డ్రోన్ల రూపంలో వ్యవసాయానికి సహకారం అందిస్తున్నామని సహకార శాఖ జిల్లా అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను గతానికి భిన్నంగా రైతులకు మేలు చేసే వనరులుగా మారుస్తామని, పారదర్శక విధానాలను అవలంభిస్తామనే ధీమా వ్యక్తం చేశారు. రుణాలు మొదలు.. రికవరీ వరకు అన్ని విషయాల్లో మంచి పనితీరుని జగిత్యాల జిల్లాలో కనబరుస్తామంటున్న అధికారి 'ఈనాడు– ముఖాముఖి'లో వెల్లడించిన విషయాలిలా..

విస్తృత అవకాశాలు..

రైతులను అన్నిరకాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు విస్తృత అవకాశాలున్నాయి. 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) పరిధిలో ఇప్పుడున్న పరిస్థితుల్ని సమగ్రంగా అధ్యయనం చేస్తున్నాం. ఏరకంగా అన్నదాతలకు మేలు చేయవచ్చనే విషయమై ప్రణాళికల్ని రూపొందిస్తున్నాం. గతంలో జరిగిన లోటుపాటు, ఇక్కట్లు, నిధుల దుర్వినియోగం ఇలా చాలా సమస్యలున్నాయి. వీటన్నింటిని పర్యవేక్షిస్తూ ఇక మీదట పూర్తిగా రైతుకు జవాబుదారీ తనం సహకార సంఘాల ద్వారా అందే విధంగా చొరవ చూపిస్తాం. సిబ్బంది పనితీరులో మార్పు కనిపిస్తుంది. కర్షకుల ఆలోచనలకనుగుణంగా సమష్టి నిర్ణయాలతో అన్ని సంఘాలను ఆదర్శనీయంగా మారుస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లబ్ధి చేకూరుస్తాం.

ఆర్ఆర్ చట్టంతో వసూలు..రైతుల శ్రేయస్సుకు పాటుపడాల్సిన కొన్ని సంఘాలు నిధుల్ని దుర్వినియోగం చేసిన ఆరోపణలున్నాయి. వీటి విచారణలు పూర్తయ్యాయి. ఇంకా పెండింగ్‌లో ఉన్నవాటిని గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. కొన్ని న్యాయస్థానం పరిధిలో ఉన్నాయి. రెండు కేసులు కొలిక్కి వస్తున్నాయి. మూడు సంఘాలకు సర్‌ఛార్జీలు త్వరలో జారీ చేస్తాం. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం అక్రమాలకు పాల్పడిని పాలకవర్గాలకు, అక్కడి సిబ్బందికి తాఖీదులిచ్చి దుర్వినియోగమైన మొత్తాన్ని తిరిగి ప్రభుత్వ ఖజానాకు చేరుస్తాం. ఇక మీదట ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు రైతుల సొమ్మును వినియోగించే విషయంపై ప్రత్యేక దృష్టి పెడుతాం. ఎక్కడ కూడా అవినీతి అక్రమాలకు తావులేకుండా మా పర్యవేక్షణను కొనసాగిస్తాం. ప్రస్తుతం కొన్ని సంఘాల్లో ఆడిట్ జరుగుతుంది. పూర్తయ్యాక సర్వసభ్య సమావేశాన్ని పెడతాం.

ఉపకరణాలతో ఆదాయం..ప్రస్తుతం ఇఫ్కో వారి సహకారంతో సారంగపూర్, ఇబ్రహీంపట్నం, వల్లంపల్లి, మెట్ల చిట్టాపూర్, గంభీర్‌పూర్, మెట్‌పల్లి, ఇటిక్యాల సంఘాల పరిధిలో పెద్ద డ్రోన్‌లున్నాయి. వీటి ద్వారా గంటకు తక్కువ ఖర్చుతో పురుగుమందులను పిచికారీ చేసే వ్యవస్థ అందుబాటులో ఉంది. వీటిని తక్కువ మొత్తంతో రైతుకు అద్దెకిస్తున్నాం. శిక్షణ పొందిన మా సిబ్బంది పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఇక మీదట ఇంకొన్ని ఆధునిక ఉపకరణాలను మా సంఘాల్లో అందుబాటులో ఉంచాలనుకుంటున్నాం. అన్నదాతల ఆలోచనల మేరకు త్వరలో హార్వెస్టర్లు కొనుగోలు చేస్తాం. ఆగ్రో సహకారంతో ఇతర ఉపకరణాల్ని తెచ్చి తక్కువ అద్దెతో అందిస్తూ ప్యాక్స్‌లను లాభదాయక సంఘాలుగా మారుస్తాం. ఇక రసాయన ఎరువుల వాడకం విపరీతమవుతున్న తరుణంలో ప్రత్యామ్నయంగా సేంద్రియ ఎరువుల తయారీకి ప్రాధాన్య తనిస్తాం. జీలుగు, పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తాం. విత్తనాలు మొదలు పంట ఉత్పత్తులు అమ్మకం వరకు మాశాఖ సహకారం అందిస్తాం. ఈ ఏడాదిలో మా సంఘాల తరపున 3.07లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నాం.

## మాజీ కో ఆప్షన్ సభ్యుడు మతిన్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు మతిన్ ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరామర్శించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు మతిన్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,





కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ లు మతిన్ నివాసానికి విచ్చేసి మతిన్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మాజీ సర్పంచ్ కిషోర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు శామీర్ పేట సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్ పేట సెక్షన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉండబోతోందని శామీర్ పేట విద్యుత్ ఏ ఈ రాఘవేందర్ రావు ఓ ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. మంగళవా



రం శామీర్ పేట విద్యుత్ సబ్‌స్టేషన్లో మరమత్తుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. సెక్షన్ పరిధిలోని దేవర యాంజల్, పోతాయిపల్లి, తూముకుంట, మందాయపల్లి, అంతాయపల్లి, ఉప్పరపల్లి, శామీర్ పేట, బాబా గుడా, బొమ్మ రాసి పేట, పొన్నాల, ఉద్దమర్రి, తదితర గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ చెప్పారు. ఈ విషయం విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

## అధికారుల అండతో వక్ఫ్‌భూముల ఆక్రమణ

నీలగిరి: ఆధ్యాత్మిక సంస్థల నిర్వాహణకు దాతలు భక్తితో అప్పగించిన భూములను కొంతమంది ఆక్రమణదారులు అడ్డగోలుగా కబ్జా చేస్తున్నారు. ఆక్రమిత భూములను కూడా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో వక్ఫ్‌బోర్డు పరిధిలో అయిదు వేల ఎకరాల మెట్ట, తరి భూములు 70శాతానికి పైగా ఆక్రమణలో ఉన్నాయని ప్రచారం ఉంది. దర్గాలు, మజీదులు, పీర్ల కొట్టాల నిర్వహణ కోసం ఎంతో మంది దాతలు సహృదయంతో దానం ఇచ్చిన భూములను ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డు కాపాడుకోలేక పోతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన పట్టణాల్లోనే నిరంతరాయంగా గుట్టలను చీల్చి నివాసాలు ఏర్పాటు చేసుకుంటుంటే.. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితిని ఊహించుకోవచ్చు.నల్గొండ పట్టణంలోని లతీఫుల్లా షా ఖాద్రీ దర్గాకు చెందిన 540 ఎకరాల భూమి (దర్గా ఉన్న గుట్ట)ని కొన్నేళ్లుగా కొందరు ఇనాం భూమి అంటూ అమ్ముకుంటున్నారు. అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని బెదిరించి రాజీ కుదుర్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ భూముల ఆక్రమణలపై అనేక కథనాలు ప్రచురించింది. లతీఫ్ షా ఖాద్రీ దర్గా భూములను ఆక్రమించుకున్న వారిపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసు విచారణలో ఉన్నా.. దర్గా భూముల ఆక్రమణలు ఆగడంలేదు. నల్గొండ దేవరకొండ, భువనగిరి తదితర ప్రాంతాల్లోని దర్గా భూములను ఆక్రమించుకున్నారు. గుట్టలను ఆక్రమించి మట్టి, రాళ్లు, భూములు అమ్మేసుకుంటున్నారు. అధికారంలోకి వస్తే.. ఆ పార్టీ నాయకులతో అంటకాగుతూ ఆక్రమణలకు పాల్పడుతున్నారనే ప్రచారం ఉంది.

మదీనా మజీద్ కమిటీపై కేసునమోదు..

వక్ఫ్‌బోర్డుకు చెందిన భూముల్లో నిర్మించిన భవనాలకు అద్దె కమిటీకి చెల్లించాలని, వక్ఫ్‌బోర్డుకు ఇస్తామనే వాదన కిరాయిదారుల మధ్యన జరుగుతుంది. ఈ వివాదం పోలీసుల వద్దకు చేరింది. అద్దెకోసం కమిటీ సభ్యులు వేదిస్తున్నారనే ఫిర్యాదుతో ఇటీవల టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వక్ఫ్ అధికారులు సకాలంలో స్పందించకపోవడం వల్లనే కమిటీ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని కిరాయిదారులు బోర్డు ఛైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆక్రమించి నివాసాలుగా ఏర్పాటు ..

వక్ఫ్‌బోర్డుకు చెందిన భూముల్లో పక్కా భవనాలు నిర్మించుకుని వ్యాపారాలు నిర్వహిస్తూ, నివాసాలు ఏర్పాటు చేసుకున్నా.. సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకున్నది లేదు. నల్గొండ పట్టణంలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన భూమిలో విద్యాసంస్థల భవనాలు, వ్యాపార సముదాయాలు, 1000 పైగా నివాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం వెనుకంజ వేస్తోంది. దేవరకొండలోనూ బహుళ అంతస్తుల భవనాలు నిర్మించినా ఎలాంటి చర్యలు తీసుకోలేక పోతున్నారు.విచారించి చర్యలు తీసుకుంటాం..

–అహ్మద్, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌జిల్లాలో వక్ఫ్‌బోర్డు పరిధిలో భూములను ఆక్రమించిన చోట విచారించి చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది కొరతతో సకాలంలో విచారించలేక పోతున్నాం. పట్టణాల్లో ఆక్రమించి నివాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకున్న వాటిని గుర్తించి నోటీసులిచ్చాం. లతీఫ్ షా ఖాద్రీ దర్గాకు చెందిన భూముల ఆక్రణమణపై ఇప్పటికే కేసు నమోదయింది. బినామీ కమిటీ పేరుతో ఆక్రమించుకుని సంస్థ ప్రమేయం లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం.

# అక్రమాలను పట్టాలెక్కించారు

హైదరాబాద్ : హైదరాబాద్ ఐటీ కారిడార్ సమీపంలోని గండిపేట మండలంలో కొందరు 70 ఎకరాల ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా రికార్డుల్లో మార్చేసుకున్నారు. అయిదేళ్ల కిందట ధరణి పోర్టల్‌లోనూ వారి పేర్లు, కుటుంబ సభ్యుల పేర్లతో నమోదు చేయించారు. ప్రస్తుతం ఆ భూముల విలువ రూ.3,500 కోట్లు ఉంటుందని రెవెన్యూ అధికారుల అంచనా.

అనుమానం రాకుండా..

పోర్టల్‌లో నమోదు చేసే సమయంలో తెలివిగా వ్యవహరించి అప్పుడున్న కొందరు అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సహకారంతో ఈ అక్రమాలకు పాల్పడ్డారు. ధరణి రికార్డుల్లో మార్పులు చేసుకున్నా, నిర్మాణాలు చేపట్టినా, ప్లాట్లుగా విభజించినా రెవెన్యూ అధికారులకు అనుమానం వస్తుందని ఖాళీగా ఉంచారు. ఐటీ కారిడార్‌లో భారీ నిర్మాణాలు చేపడుతున్న కంపెనీలు, బిల్డర్లు తమ కూలీల కోసం స్థలం కావాలంటూ కోరినప్పుడు అక్కడ%ళ%క్కడా తాత్కాలికంగా టెంట్లు వేసుకోనిస్తున్నారు. కొన్ని రోజుల కిందట ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ ఉన్నతాధికారికి అనుమానం వచ్చి అధికారులను విచారించగా ప్రభుత్వ స్థలమేనని నిర్ధారణ అయింది. రికార్డుల్లో పేర్లు ఎలా మార్చారు? ఎవరెవరి ప్రమేయం ఉంది ?అన్న అంశాలపై పరిశీలిస్తున్నారు.

సర్కారు భూముల సరిహద్దులోనే..

ఐటీ సంస్థలు..జంట జలాశయాలున్న మండలంలో రెండు గ్రామాల్లో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నాయి. 30 ఏళ్ల కిందటి వరకూ అక్కడ ఎలాంటి అభివృద్ధి జరగకపోవడంతో ప్రభుత్వం కూడా అటువైపు కన్నెత్తిచూడలేదు. సైబర్ టవర్స్, విమానాశ్రయం వంటివి తెరపైకి రావడంతో ఆ మండలంలోని రెండు గ్రామాల్లో భూముల విలువ పెరుగుతుందని ముందే గ్రహించిన కొందరు ఒక గ్రామాన్ని ఎంపిక



చేసుకుని సర్కారు భూములకు సమీపంలోని రైతుల వద్ద 10 ఎకరాలు కొనుగోలు చేశారు. వీటికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూముల 12 సర్వే నంబర్లలో దశల వారీగా 70 ఎకరాలు ఆక్రమించారు. అనంతరం 20 ఏళ్ల కిందట పహాణి రికార్డులు వారి పేర్లపై సృష్టించారు.

మైనింగ్ అనుమతులు తీసుకొని...

కబ్జాదారులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. సరిహద్దులుగా ప్రహరీలు నిర్మిస్తే అధికారుల తనిఖీల్లో తెలిసిపోతుందని మట్టితో అక్కడక్కడా స్పీడ్‌బ్రేకర్లు వంటివి ఏర్పాటు చేశారు. భూముల ధరలు పెరగడం, పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో ప్రణాళికలో రెండో భాగాన్ని అమలు చేశారు. తమకున్న పట్టా భూమిలో మైనింగ్ చేసుకుంటామని గనుల శాఖ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకున్నారు. మైనింగ్ పేరుతో ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు వచ్చినప్పుడు తవ్వకాలను నిలిపేసేవారు. పరిసర ప్రాంతాల్లో బహుళ అంతస్తులు నిర్మాణాలు అధికం కావడంతో వేగంగా మట్టి, రాళ్లను తవ్వి సమీపంలోని కంపెనీలకు ఇస్తున్నారు. కంపెనీల కాలుష్యంపై ఇటీవల స్థానికులు ఫిర్యాదు చేయగా అధికారులు కంపెనీని మూసివేయించారు. గనుల శాఖ అనుమతి పత్రాన్ని చూడగా.. ఆ సర్వే నంబరు ప్రభుత్వ భూమిగా తేలింది. దీంతో అంతర్గత విచారణ చేపట్టారు.

# కొంత కాలం వేచి చూద్దాం

హైదరాబాద్: ఎన్నికల ముందు భూములు, ప్లాట్ల వేలం ద్వారా రూ.వేల కోట్లు ఖాతాలో వేసుకున్న హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రస్తుతం వేచి చూసే ధోరణి అవలంభిస్తోంది. హెచ్ఎండీఏలోని ఏడు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాల భూములు, స్థలాలు ఉన్నాయి. ఒకేచోట 100, 200 ఎకరాలు కూడా అందుబాటులో ఉన్నాయి. గతంలో దఫదఫాలుగా బహిరంగ వేలంలో విక్రయించి రూ.వేల కోట్లు ప్రభుత్వ ఖాతాకు జమ చేసింది. కోకాపేట, బుద్వేల్‌లో భూముల అమ్మకం ద్వారా ఆరేడు వేల కోట్లు సమకూరాయి. కోకాపేట్‌లో రికార్డు స్థాయిలో ఎకరం రూ.100 కోట్లు పలికింది. రాజేంద్రనగర్ బుద్వేల్‌లో 100 ఎకరాల వేలంతో రూ.3000 కోట్లపైనే సమకూరింది. మోకిలలో చదరపు గజానికి రికార్డు స్థాయిలో రూ.లక్ష పలికింది. భైరాగిగూడ, మంచిరేవుల, నల్లగండ్ల, చందానగర్, పీరంచెరువు, బాచుపల్లి, బౌరంపేట్, చెంగిచర్ల, సూరారం, వెలిమల, నందిగామ, అమీన్‌పూర్, కృష్ణారెడ్డిపేట్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన వేలానికి మంచి స్పందన వచ్చింది. ఆయా ప్రాంతాల్లో గజం రూ.12 వేల నుంచి రూ.65 వేలుగా నిర్ణయించినా అంతకుమించి ధర పలికింది.

తొలుత మిగిలిపోయిన ప్లాట్లు... గతంలో హెచ్ఎండీఏ రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో పలు లేఅవుట్లను అభివృద్ధి చేసింది. మోకిలలో 300 ప్లాట్లను వేలం వేయగా.. గజం రూ.లక్ష వరకు పలికింది. అయితే వేలంలో ఎక్కువకు కొనుగోలు చేసిన చాలామంది గడువు తేదీ ముగిసినా డబ్బులు చెల్లించలేదు. ఇలా ఒక్క మోకిలలోనే 50 శాతం వరకు ప్లాట్లు మిగిలిపోయినట్లు తెలుస్తోంది. తుర్కయాంజిల్ ఇతర లేఅవుట్లలోనూ అదే పరిస్థితి. స్థిరాస్తి మార్కెట్లో కొంత ఊపు వచ్చాక ఖాళీ ప్లాట్లను వేలం వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లేఅవుట్లలో స్థలాలకు వచ్చిన స్పందన తర్వాత ముందుకు వెళ్లే అవకాశం ఉందని అంటున్నారు. గతంలో కొందరు ముందస్తు వ్యూహంతో వేలంలో పాల్గొని కృత్రిమంగా ధరలు పెంచారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సంబంధిత లేఅవుట్‌కు సమీపంలో తమ భూములు ఉండటంతో వాటి ధర పెంచడానికి ఇలా అధిక ధర కోట్ చేసినట్లు విమర్శలు విన్పించాయి. అధిక ధరకు పాడుకున్న వారిలో కొందరు తర్వాత డబ్బులు చెల్లించక పోవడం.. మరికొందరు ఒకటి రెండు వాయిదాలు చెల్లించి మిగతా డబ్బులు జమ చేయకపోవడంతో తర్వాత హెచ్ఎండీఏ వాటిని రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ప్లాట్ల వేలం వేసే ముందు కనీస ధర విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించి ముందుకు వెళ్లాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పట్టభద్రులూ మేల్కోండి




కరీంనగర్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి ఎన్నికల ప్రచార సందడి రోజురోజుకు పెరుగుతోంది. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేశారు. పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలుస్తూ.. ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. కానీ ఓటరు నమోదు ప్రక్రియ మాత్రం నత్తనడకన సాగుతోంది. దరఖాస్తుల స్వీకరణకు నవంబరు 6వ తేదీ వరకు గడువు ఉండటంతో 13 రోజులే మిగిలి ఉంది. ఇకనైనా అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు నమోదుకు కదలాల్సిన అవసరముంది.

నమోదు కేంద్రాలు వెలవెల..జిల్లాల్లోని అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారిని నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. అయినా ఆదరణ అంతంతా మాత్రంగానే ఉంటోంది. దీపావళి పండగ అనంతరం నమోదు ప్రక్రియ వేగం పుజుకోనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల్లోనూ స్పందన అంతంతే..

సాధారణంగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో కొనసాగే వారు నమోదులో ముందుంటారని ఎవరైనా భావిస్తుంటారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు విషయంలో మాత్రం ఆ వర్గాలు ఆసక్తి చూపడంలేదని తాజా గణాంకాలను చూస్తే తెలుస్తోంది. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా నమోదు పత్రాలు అందజేసినా పరిస్థితిలో మార్పు కనిపించడంలేదు. మండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే కొత్తగా అర్హులందరూ దరఖాస్తు సమర్పించాలి. ఇప్పటివరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయులు 1761, పట్టభద్రులు 66,743 ఓటర్లుగా నమోదు చేసుకున్నారు.

ఓటరుగా ఎవరు నమోదు చేసుకోవచ్చు.. పట్టభద్రులు ఓటు నమోదు (ఫారం-18 చేసుకోవాలంటే) 2021 అక్టోబరు 31 వరకు డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకులైతే 2018 నవంబరు వరకు మూడేళ్లకు తగ్గకుండా ఉన్నత పాఠశాల, కళాశాల స్థాయి విద్యాసంస్థల్లో పని చేసి ఉండాలి. వారు ఫారం-19తో ఓటరు నమోదు చేసుకునే వీలుంటుంది. చరవాణిలోనూ.. ఉన్న చోట నుంచే ఓటరు నమోదు చేసుకునే అవకాశం సైతం ఎన్నికల కమిషన్ కల్పించింది. అందుకు %www. ceotelangana.nic.in% వెబ్‌సైట్‌ను ప్రవేశపెట్టింది. పట్టభద్రులు ఫారం-18, ఉపాధ్యాయులైతే ఫారం-19 దరఖాస్తును పూరించి గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలతోపాటు ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే మీరు ఓటరుగా నమోదైనట్లే.

# కేంద్రాలు ప్రారంభం.. తూకాల్లో జాప్యం



సిరిసిల్ల : జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కానున్నాయి. ఈ నెల మొదటి వారంలోనే ముస్తాబాద్, చందుర్తి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రెండ్రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చలి తీవ్రత పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ధాన్యం ఎంత ఆరబెట్టినా తేమశాతం 17కు రావడం కష్టంగా ఉంటుంది. దీనికితోడు కొనుగోళు ప్రారంభం కాకపోతే ధాన్యం ఆరబోసుకునేందుకు గ్రామాల్లో స్థలాలు దొరకని పరిస్థితి ఏర్పడుతుంది.

జిల్లాలో అత్యధికంగా 1.56 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. సన్నాలు, దొడ్డు రకాలు కలిపి 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పౌరసరఫరాలశాఖ సేకరణ లక్ష్యం 3 లక్షల మెట్రిక్ టన్నులు. దీనిలో అక్టోబరులో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలి. ముందుగా కోతలు పూర్తి చేసుకున్న సన్న ధాన్యాన్ని మిల్లర్లు నేరుగా గ్రామాల్లోనే కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో గురువారం నాటికి 102 కేంద్రాలు ప్రారంభించారు. వాటిలో ఎక్కడా తూకాలు జరగడం లేదు. తేమశాతం వచ్చే వరకు ధాన్యం ఆరబోస్తూ.. సాయంత్రం కుప్పలు పోస్తున్నారు. జిల్లాలో మిల్లుల సామర్థ్యం వారీగా ధాన్యం కేటాయింపులు పూర్తయ్యాయి. అలాగే కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపునకు లారీలకు టెండర్లు కూడా జరిగాయి.

ధాన్యం టెస్ట్ మిల్లింగ్, సీఎంఆర్ నిబంధనలు, పాత మిల్లింగ్ బకాయిల చెల్లింపు, కొత్త ధరల అమలు తదితర అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాలని ఇటీవల మిల్లర్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు కూడా జరిగాయి. కానీ వారి డిమాండ్లపై స్పష్టత రాలేదు.

పౌరసరఫరాలశాఖ దొడ్డు ధాన్యం మిల్లర్లకు కేటాయించి, సన్నాలను వ్యవసాయశాఖ గోదాంల్లో నిల్వ చేయాలని ప్రణాళికలు రూపొందించింది. దీనికోసం గన్నీ సంచులకు ప్రత్యేక ముద్రలు వేయడం, వీటిని కుట్టేందుకు ప్రత్యేక ధారాన్ని ఉపయోగించనున్నారు. గోదాంల కేటాయింపుపై వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా అంగీకరించినా ఎలాంటి ధ్రువీకరణ మాత్రం ఇవ్వలేదు. ఇటు మిల్లర్లు ముందుకు రాకపోవడం, అటు గోదాంల కేటాయింపులపై స్పష్టత లేక తూకాల్లో జాప్యం జరుగుతున్నట్లు పౌరసరఫరాలశాఖ వర్గాల సమాచారం.

ఆరబెట్టడం.. కుప్పలు పోయడం

నాకున్న మూడు ఎకరాల్లో వరిసాగు చేశాను. పది రోజుల క్రితమే కోతలు పూర్తి చేసుకుని నాంపల్లి పీఏసీఎస్ కేంద్రానికి తీసుకొచ్చాను. ఉదయం కేంద్రానికి వచ్చి కుప్పలుగా ఉన్న ధాన్యాన్ని ఆరబెడుతున్నాను. ధాన్యంపై మంచు పడుతుందని సాయంత్రానికి కుప్పలుగా పోస్తున్నాను. ఇప్పటికీ అధికారులు కేంద్రాన్ని ప్రారంభించలేదు.
కిషన్, వేములవాడ

స్థలాలకు ఇబ్బంది

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి పది రోజులు అవుతోంది. ధాన్యం ఆరబెట్టాక సాయంత్రం వచ్చి తేమచూడాల్సిన పీఏసీఎస్ సిబ్బంది ఉదయం వచ్చి చూస్తున్నారు. చలిలో ఉదయం తేమ ఎలా వస్తుందని ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వడం లేదు. తేమశాతం చూసి వెంటనే కొనుగోలు చేస్తే స్థలాలకు ఇబ్బందులు ఉండవు.
రవి, అనుపురం

ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం

మిల్లర్లకు సంబంధించిన కొన్ని డిమాండ్‌లు ఉన్నాయి. వాటిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. దానికోసం వేచిచూస్తున్నాం. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వసతులు సమకూర్చాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించాం. ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్

# ఎంతకూ పూర్తికాని నిజాం కాలం నాటి ముంతకబ్‌ల తర్జుమా

హైదరాబాద్ : దేవాలయాల భూముల వివాదాల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. నకిలీ పత్రాలు సృష్టిస్తున్న కబ్జాకోరులు రూ.కోట్ల భూములను చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ భూములు రాజధాని పరిధిలోనే అత్యధికంగా ఉన్నాయి. సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్‌కు సంబంధించి గోత్రనామాలు, ఫౌండర్ ట్రస్టీలు, తక్కువ విస్తీర్ణంలోని భూవివాదాలు ఉండగా రంగారెడ్డి జిల్లాలో ఎక్కువ ఉన్నాయి. కేటుగాళ్లు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. వివాదాలు ట్రైబ్యునల్‌లు, కోర్టుల వరకు వెళ్లడంతో కీలక సాక్ష్యాలుగా నిలిచే నిజాం కాలంనాటి ముంతకబ్ రికార్డులు అవసరమవుతున్నాయి. వందల ఏళ్లనాటి పత్రాలు కావడంతో వాటిని గుర్తించడానికి తలలు పట్టుకుంటున్నారు. గుర్తించినా శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో లోకాయుక్త ఆదేశాలతో ఉర్దూలో ఉన్న ముంతకబ్ రికార్డులను ఆంగ్లంలోకి అనువాదించే ప్రక్రియ మొదలుపెట్టింది. అవి పూర్తి కావడం లేదు.

రూ.వేల కోట్ల భూములు వివాదాల్లో...రాజధాని పరిధిలో కొందరు ఈవోలకు ఆలయాల భూముల వివాదాలపై అవగాహన లేదు. దీంతో అనేక కేసులు వీగిపోతున్నాయి. భూముల సరిహద్దులపై అవగాహన లేకపోవడం, ఏళ్ల క్రితం నమోదైన కేసులు కావడం, ఒకే ఆలయానికి చెందిన భూములపై వేర్వేరు వివాదాలు ఉండటంతో విచారణ సమయంలో గందరగోళానికి గురవుతున్నారు.

# పరివర్తన పేరుతో ఇదేం ప్రవర్తన?

హైదరాబాద్ : మద్యం, మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటపడేస్తామంటూ నగరంలోని కొన్ని రిహాబిలిటేషన్ (పునరావాస) సెంటర్లు, వ్యసన విముక్తి కేంద్రాలు దారుణాలకు పాల్పడుతున్నాయి. మార్పు పేరుతో బాధితులను తాళ్లతో కట్టేసి బెల్టు, కర్రలతో కొడుతూ చిత్రహింసలు పెడుతున్నాయి. ఆహారం పెట్టకుండా నరకం చూపిస్తున్నాయి. అప్పటికే వ్యసనాల బారినపడి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు దెబ్బలకు తాళలేక ప్రాణాలు వదిలేస్తున్నారు. తాజాగా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడలోని ఓ పునరావాస కేంద్రంలో చేరిన బాధితుడిని బెల్టుతో కొట్టడంతో అతను మరణించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కేంద్రంలో చేర్పించిన బాధితుడు మరణించడం, ఒంటిమీద దెబ్బలు ఉండడం కలకలం రేపింది. ఇలాంటి ఘటనలు వెలుగు చూసినప్పుడు వ్యసన విముక్తి పేరుతో నిర్వాహకులు చేసే దారుణాలు బయటపడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వందలాది కేంద్రాలు న్నాయి.

కఠిన నిబంధనలున్నా.. :

ఈ కేంద్రాలు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సొసైటీ చట్టం కింద నమోదవ్వాలి. కేవలం ఆదాయం కోసం కాకుండా మానసిక పరివర్తన కోసం నిర్వహించే స్వచ్ఛంద సంస్థలా కొనసాగించాలి. ః బాధితుల్లో పరివర్తన తెచ్చేందుకు ప్రాథమికంగా 30 రోజుల కింద చేర్చుకోవచ్చు. అవసరమైతే దీన్ని 60 రోజులకు పెంచొచ్చు

బాధితుడి, మానసిక పరిస్థితి ఆధారంగా చికిత్స అందించాలి.

నిపుణులతో కౌన్సెలింగ్ ఇస్తుండాలి.

బాధితులతో స్నేహపూర్వకంగా మెలగాలి.

కుటుంబసభ్యులు పట్టించుకోక..

మత్తుకు బానిసగా మారిన వారి కుటుంబ సభ్యులు క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు బాధితులకు శాపంగా మారుతున్నాయి. వారిని పునరావాస కేంద్రాల్లో వదిలేసి కొన్ని నెలలపాటు పరామర్శించడం లేదు. ఇదే అవకాశంగా నిర్వాహకులు బాధితులకు నరకాన్ని చూపిస్తున్నారు. కొన్నిసార్లు మత్తుమంది ఇచ్చి వాహనాల్లో ఇంటి నుంచి తీసుకెళ్లి బంధిస్తున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ రోజుల తరబడి



వేధిస్తున్నారు.

డబ్బు కోసం..

వాస్తవానికి వ్యసన విముక్తి కేంద్రాల నిర్వహణ పరిమితి అయిదేళ్లు అయినా కొన్ని అనుమతి లేకుండా అడ్డగోలుగా కొనసాగుతున్నాయి. తాజాగా దమ్మాయిగూడలో వ్యక్తి మరణించిన పునరావాస కేంద్రం లైసెన్సు గత ఏడాది జూన్‌లోనే ముగిసినా యథేచ్ఛగా కొనసాగడమే ఇందుకు నిదర్శనం.ః వ్యసనానికి అలవాటుపడిన బాధితులు పునరావాస కేంద్రంలో పరిస్థితులను జీర్ణించుకోలేరు. నిర్వాహకులు వారి మానసిక పరిస్థితిని పట్టించుకోకుండా చిత్రహింసకు గురిచేస్తున్నారు. మాట వినకపోయినా, ఆహారం తీసుకోకపోయినా కొట్టడం రివాజుగా మారింది.

వీటిని నిర్వహిస్తున్నట్లు స్థానిక మున్సిపాలిటీ నుంచి అనుమతితీసుకోవాల్సి ఉన్నా అలా జరగడం లేదు.

నిపుణుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వాలి

బాధితులకు నిపుణుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వాలి. శిక్షించడం సరికాదు. అవగాహన, పరిస్థితిని వివరిస్తూ వారి మానసిక పరిస్థితికి అనుగుణంగా అన్ని కోణాల్లో మార్పు తీసుకురావాలి. నైపుణ్యం లేనివారు నిర్వహించకుండా చూడాలి.దేవికారాణి, అమృత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు

# మూసీ నిర్వాసితులకు 800 ఎకరాలు

హైదరాబాద్ :మూసీ నిర్వాసితులకు న్యాయం చేయడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వారిని ఒప్పించాకే ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఒక్కొక్కరికి 150-200 గజాల స్థలాన్ని ఇవ్వాలని సర్కార్ యోచిస్తోంది.

పట్టుదలతో ప్రభుత్వం.. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఎలాగైన సరే మొదలుపెట్టాలని చూస్తోంది. ఇందుకు మూసీ గర్భంలో ఉంటున్న వారితో పాటు 50 మీటర్ల బఫర్ జోన్‌లోని వారినీ అక్కడి నుంచి ఖాళీ చేయించాల్సి ఉంది. మూసీ గర్భంలో ఉన్న 1600 మందిలో మూడొంతుల మంది ఖాళీ చేసి ప్రభుత్వం ఇస్తున్న రెండు పడకల ఇళ్లలోకి వెళ్లడానికి అంగీకరించారు. ఇప్పటికే 250 మంది వెళ్లిపోయారు. బఫర్ జోన్‌లోని వారు మాత్రం తమకు పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మొత్తం చాలాదని ఖాళీ చేయడానికి ససేమిరా అంటున్నారు.

మంత్రికి త్వరలో నివేదిక..

ఈ మొత్తం వ్యవహారంపై కొద్ది రోజుల కిందట మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సీఎం చర్చించారు. బఫర్ జోన్‌లోని నిర్వాసితులకు ఇళ్ల స్థలాలను కూడా ఇస్తేనే బాగుంటుందని చెప్పడంతో రేవంత్‌రెడ్డి కూడా సూత్రప్రాయంగా అంగీకరించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి పొంగులేటి సియోల్ పర్యటనలో వెల్లడించారు. ఇందుకు 650 నుంచి 800 ఎకరాలు అవసరమని అధికారులు గుర్తించారు. ఇప్పుడు స్థలాలు ఎక్కడున్నాయనే దానిపై అన్వేషణ మొదలు పెట్టారు. ఓఆర్ఆర్ సమీపంలో ప్రభుత్వ భూములుండటంతో.. వాటి లెక్కలు తీస్తున్నారు. ఎక్కడ ఎన్ని ఎకరాలు ఉందో కొద్ది రోజుల్లోనే మంత్రికి నివేదిక సమర్పిస్తామని ఓ అధికారి తెలిపారు. రెండు, మూడుచోట్లనైనా సేకరించి లేఅవుట్లు వేసి సకల సదుపాయాలు కల్పించాలని భావిస్తోంది. అక్కడ గజం 50 వేలకు పైబడి ధర పలికే అవకాశం ఉండటంతో ఈ ప్రతిపాదనకు బఫర్ జోన్‌లోని నిర్వాసితులు అంగీకరిస్తారని అనుకుంటున్నారు.

# ఆగని బియ్యం దందా

మెట్‌పల్లి : జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది. వినియోగదారుల నుంచి అక్రమార్కులు చౌకగా బియ్యం కొనుగోలు చేసి వాటిని ఇతరులకు ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చౌకధరల దుకాణాల్లో బియ్యం పంపిణీ చేసే రోజుల్లోనే గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ తిరిగి కిలోకు రూ.12 నుంచి రూ.15 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల రేషన్ దుకాణాల వద్దే తిష్ఠ వేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని పెద్ద వాహనాల్లో ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. అంతేకాకుండా కొన్ని చోట్ల నేరుగా చౌకధరల దుకాణాల నుంచే బియ్యం తరలిపోతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇటీవల పట్టుబడ్డ బియ్యం సంచులను పరిశీలిస్తే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యాన్ని తీసుకెళ్లే గోనె సంచులు ఉండడం గమనార్హం. మెట్‌పల్లి సర్కిల్ పోలీసులు ఇటీవల కాలంలోనే సుమారు 190 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని నాలుగు ద్విచక్ర వాహనాలు, అయిదు నాలుగు చక్రాల వాహనాలను సీజ్ చేయడంతో పాటు తొమ్మిది మంది వ్యక్తులపై కేసులు నమోదు చేయడం అక్రమ పీడీఎస్ బియ్యం దందా ఎక్కువగా కొనసాగుతుందనే ఆరోపణలకు బలం చేకూరుస్తుంది.

తరలి పోతుందిలా..!

కిలోల చొప్పున సేకరించి క్వింటాళ్లుగా పోగు చేస్తున్న రేషన్ బియ్యం వివిధ చోట్లకు తరలిపోతున్నాయి. కొందరు మిల్లర్లు అక్రమ రేషన్ బియ్యం దందాను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతుండగా, ఆగస్టు నెలలో కోరుట్లలోని ఓ రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే రేషన్ బియ్యాన్ని కోళ్లదాణా కోసం పౌల్ట్రీఫామ్‌లకు తరలిస్తున్నారు. బియ్యాన్ని నూకలుగా మార్చి కోళ్లదాణాగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పోలీసులు



ఇబ్రహీంపట్నం మండలంలోని రెండు పౌల్ట్రీఫామ్‌లలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు.

చూసీచూడనట్లుగా..

రేషన్ బియ్యం దందా వ్యవహారంపై కొందరు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ మార్గాల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నా చెక్‌పోస్టులు లేకపోవడంతో అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇటీవల కేవలం పోలీసు అధికారులు మాత్రమే దాడులు జరిపి అక్రమ బియ్యాన్ని పట్టుకున్నారు. రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ విభాగాలు నిఘా పెడితే అక్రమ రేషన్ బియ్యం దందాను అరికట్టవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు.

పోలీసుల దాడులు ఇలా..

కోరుట్లలోని బాలాజీ రోడ్డులో ఉన్న ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 352.2 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు.

సెప్టెంబర్ 11న మెట్‌పల్లి మండలం వేంపేట నుంచి ఆర్మూర్ వైపు టాటా మ్యాజిక్ వాహనంలో తరలిస్తున్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు.?

ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో రెండు పౌల్ట్రీఫామ్‌లలో నిల్వ ఉంచిన 125 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో శివారులో సెప్టెంబర్ 12న వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.

మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు ఆటోలో తరలిస్తుండగా, అక్టోబర్ 9న జగ్గాసాగర్ శివారులో 24 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మెట్‌పల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉన్న ఈ బియ్యం వివిధ చోట్ల పట్టుబడ్డవి. గత జులైలో 132.10 క్వింటాళ్లు, ఆగస్టులో 282 క్వింటాళ్ల పట్టుబడ్డ బియ్యాన్ని వేలం వేశారు. సెప్టెంబర్‌లో సుమారు 163 క్వింటాళ్ల బియ్యం పట్టుబడగా, ఇక్కడ నిల్వ చేశారు. అక్టోబర్‌లో ఇప్పటి వరకు 24 క్వింటాళ్లు పట్టుబడ్డాయి. మొత్తంగా ఇక్కడ ఇంకా 265.90 క్వింటాళ్ల పట్టుబడ్డ బియ్యం ఉన్నాయి. ఇవి కేవలం దాడుల్లో పట్టుబడ్డవి మాత్రమే. ఈ లెక్కన ఇంకా అడ్డదారుల్లో రేషన్ బియ్యం ఎంత తరలిపోతుందో అర్థం చేసుకోవచ్చని పలువురు ఆరోపిస్తున్నారు.

నిఘా పెడుతున్నాం

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెడుతున్నాము. మెట్‌పల్లి పోలీస్ సర్కిల్ పరిధిలో పలుచోట్ల దాడులు చేసి సుమారు 400 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని సంబంధిత అధికారులకు అప్పగించాము. తరలించేందుకు ఉపయోగించిన వాహనాలను కోర్టుకు అప్పగించాము. ప్రతి నెల 1 నుంచి 15 వరకు ఎక్కువగా అక్రమ రవాణా సాగుతుందని గుర్తించి పోలీస్ సిబ్బందితో నిత్యం నిఘా ఉంచుతున్నాము. గతంలో కంటే కొంత వరకు అక్రమ రవాణాను నియంత్రించాము. ఒకసారి పట్టుబడ్డ వారు మరోసారి పట్టుబడితే రూ.5 లక్షల పూచీకత్తుపై బైండోవర్ చేయడానికి చర్యలు తీసుకుంటాము. నిరంజన్‌రెడ్డి, మెట్‌పల్లి సీఐ

# గిరిజన మ్యూజియానికి దారేది..?

భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని విస్తరించి మరింత ప్రాచుర్యం కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించినప్పటికీ లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఐటీడీఏ మార్గంలో గేట్ వద్ద అందరికీ తెలిసేలా పెద్ద బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో ఇటుగుండా రాకపోకలు సాగేవి. ఆకతాయిలు రాత్రిపూట ఇలాంటి ద్వారాల గుండా లోపలికి ప్రవేశిస్తున్నారనే కారణంతో గేటును మూసేశారు. దీన్ని తెరిస్తే సులువుగా మ్యూజియానికి వెళ్లవచ్చు. దీనికి సమీపంలోని విద్యా వనరుల విభాగం వద్ద ఉన్న ద్వారాన్నీ ఇలాగే మూసేశారు. పర్యాటకులైనా, ఇక్కడికి అవసరాల కోసం వచ్చే గిరిజనులైనా ఐటీడీఏ కార్యాలయం ప్రధాన ద్వారం గుండానే రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

దీన్ని గుర్తించి మ్యూజియం వద్ద ఉన్న గేట్లను వినియోగంలోకి తీసుకొస్తే యాత్రికులకు సులభంగా ఉంటుంది. ఇదే క్రమంలో చాన్నాళ్ల క్రితం నిర్మించిన ప్రహరీ పక్కన రహదారి ఎత్తుగా ఉండటంతో సులభంగా గోడ దూకి ఐటీడీఏ ప్రాంగణంలోకి వెళ్లవచ్చు. గేట్లు తెరచి గోడ ఎత్తు పెంచి సెక్యూరిటీ గార్డులను నియమించాలని పలువురు కోరుతున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులుతో మాట్లాడుతూ త్వరలోనే గేట్లను తెరిచి మ్యూజియానికి సులువుగా చేరుకునేలా చేస్తామని తెలిపారు.

# దళారుల చేతిలో పత్తి రైతుల 'దగా'




వేములవాడ : పత్తి రైతులు గ్రామాల్లో దళారుల చేతిలో మోసాలకు గురవుతున్నారు. ఇప్పటికే మొదటి దఫా పత్తి సేకరణ చేసిన రైతుల నుంచి దళారులు కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో కాంటాలు పెట్టి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 42,390 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేయగా 30,028 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే జిల్లాలో పత్తి సేకరణ ఊపందుకుంది. ఇప్పటికే జిల్లాలోని చాలా గ్రామాల్లో రైతుల వద్ద దళారులు తక్కువ ధరకు భారీ ఎత్తున పత్తి కొనుగోలు చేస్తూ ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారు.

సీసీఐ కేంద్రాల ఏర్పాటుతోనే ప్రయోజనం

భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఇంకా జిల్లాలో ప్రారంభించకపోవడంతో దళారులకు కలిసొస్తుంది. ఇదే అదనుగా పత్తి రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు ప్రయోజనం కలగనున్నది. జిల్లాలో సుద్దాల, నాంపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, తాళ్లపల్లి ఐదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించినప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. 8 నుంచి 12 శాతం తేమతో ఉన్న పత్తికి సీసీఐ క్వింటాల్‌కు రూ.7,521 నుంచి రూ.7,421 వరకు పింజ పొడవును బట్టి ధరను చెల్లిస్తుంది. గ్రామాల్లో దళారులు తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పి రూ.6 వేల నుంచి రూ.6,200లకే కొంటున్నారు. పత్తి విక్రయానికి రైతులకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో దళారులు చెప్పిందే ధర అన్న చందంగా మారింది. దీంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో క్వింటాల్ పత్తికి నాణ్యతను బట్టి రూ.6,500ల వరకు చెల్లిస్తున్నారు.

రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం

జిల్లాలో అయిదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ద్వారా అగ్రిమెంట్ జరిగింది. పత్తి రైతులు తొందర పడి దళారులకు విక్రయించి మోసపోవద్దు నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి కనీస మద్దతు ధర పొందాలి.

ప్రకాశ్, జిల్లా మార్కెట్ శాఖ ఇన్‌ఛార్జి అధికారి

తూకాల్లోనూ మోసాలు గ్రామాల్లో దళారులు తూకాల్లోనూ మోసం చేస్తున్నారు. కొందరు వ్యాపారులు, దళారులు క్వింటాల్‌కు దాదాపు రెండు నుంచి మూడు కిలోలను దోచుకుంటున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఏటా పత్తి సాగుకు పెట్టుబడులు పెరిగి పోతున్నప్పటికీ ఆశించిన మేర దిగుబడులు రాక నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో ఎక్కువ ధర ఆశ చూపి దళారులు తూకంలో మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బండ రాళ్లు, పత్తి బోరాలు ఎత్తుగా వేసి తూకాలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో పత్తి కొనుగోలు చేసే దళారులపై తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో దళారులు ఇష్టారాజ్యంగా రైతుల వద్ద కొనుగోలు చేస్తూ గుట్టు చప్పుడు కాకుండా రైతులను దోపిడీకి గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

# పెరుగుతున్న భూ వివాదాలు



మల్యాల : కొండగట్టు ప్రాంతంలో ఘాట్‌రోడ్డు పక్కన నిర్మించిన దుకాణ భవన సముదాయంలోని గదులను ఓ స్థిరాస్తి వ్యాపారి ఒక్కో గదిని రూ.5 లక్షల వరకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించినట్లు పలువురు బాధితులు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కొండగట్టుకు చెందిన మరో వ్యక్తి తనకు చెందిన ఓ ప్లాట్‌ను ముగ్గురు వ్యక్తుల పేర విక్రయించడంతో పోలీసులు సదరు వ్యక్తిపై మోసం కేసు నమోదు చేశారు. ఈ విధంగా కొండగట్టు ప్రాంతంలో పలువురు వ్యక్తులు అక్రమంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

జగిత్యాల జిల్లాలో భూవివాదాలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. కొందరు స్థిరాస్తి వ్యాపారులు, దళారుల మాయాజాలంతో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో చాలా ఏళ్ల కిందట విక్రయించిన భూములను తాము విక్రయించలేదని పేర్కొంటూ కొందరు వ్యక్తులు గొడవలకు దిగుతున్నారు. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న మల్యాల మండలంలోని ముత్యంపేట, కొండగట్టు, బల్వంతాపూర్, మల్యాల అడ్డరోడ్డు, నూకపల్లి, రాజారం తదితర గ్రామాల పరిధిలోని భూములకు డిమాండు ఏర్పడటంతో కొందరు వ్యక్తులు తాము విక్రయించిన భూమిని మళ్లీ మరో వ్యక్తికి విక్రయించడంతో వివాదాలకు దారితీస్తోంది. రాజకీయ నాయకులు కూడా భూముల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్‌తో మోసాలకు పాల్పడుతున్నారు. ?

మల్యాల అడ్డరోడ్డు, నూకపల్లి, రాజారం శివారులోని వ్యవసాయ భూములు ఇళ్లప్లాట్లకు అనుకూలంగా ఉండటంతో పట్టణ ప్రాంతాలకు చెందిన వైద్యులు, బడా వ్యాపారులు ఎకరాకు రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. భూములను రిజిస్ట్రేషన్ చేసుకొన్నప్పటికీ మళ్లీ భూ యజమానులు అది తమ తాతలనాటి భూమి అని దానిని తాము విక్రయించలేదని పేర్కొంటూ నకిలీ దస్త్రాలు సృష్టించి కొత్తగా రెవెన్యూ అధికారుల నుంచి పాసు పుస్తకాలు పొందుతుండటం పెద్ద సమస్యగా మారుతోంది. ?

భూముల కొనుగోలు తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు సదరు భూమిని రెవెన్యూ కార్యాలయంలో 'మ్యుటేషన్' అమలు చేసుకోకపోతే నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని దళారులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ విధంగా మల్యాల మండలంలో పదుల సంఖ్యలో ఇటీవలే భూవివాదాలు చోటుచేసుకున్నాయి. గతంలో రెవెన్యూ కార్యాలయంలో పనిచేసిన కొందరు వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర వ్యక్తులకు చెందిన భూములను వారికి తెలియకుండా తమ పేర లేదా కుటుంబ సభ్యుల పేర నమోదు చేసుకోవడంతో బాధితులు ఇప్పటికీ న్యాయం చేయాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

మోసాలకు పాల్పడేవారిపై చర్యలు

భూములకు సంబంధించి సరైన పత్రాలు కలిగి ఉండి, మోఖాపై ఉండే వ్యక్తుల భూముల ఆక్రమణకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మోసాలకు పాల్పడే వ్యక్తులపై కేసు నమోదు చేయడంతోపాటు అసలైన భూయజమానులకు రక్షణ కూడా కల్పిస్తాం. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి ఇరువైపుల భూములకు రేట్లు అధికంగా ఉండటంవల్ల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డ పలువురిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం.

నీలం రవి, మల్యాల సీఐ

అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా చూస్తాం

మల్యాల మండలంలో కొందరు అక్రమంగా భూముల రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు, మరికొందరు తమ భూమిని విక్రయించినా తాజాగా పాసుపుస్తకాలు పొందినట్లు మా దృష్టికి రావడంతో చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ రిజిస్ట్రేషన్ల గురించి మా దృష్టికి తీసుకొస్తే బ్లాక్ చేయిస్తాం. గతంలో ధరణిలో ఒకరిభూమి మరొకరి పేర రిజిస్ట్రేషన్ చేశారు. ఈసీ పరిశీలించి పరిష్కరిస్తున్నాం.మునిందర్, తహసీల్దారు, మల్యాల

# విదేశీ కొలువు.. స్పందన కరవు!

ఖమ్మం : దుబాయ్‌లో డెలివరీ బాయ్స్‌గా పని చేయాలనుకునే ద్విచక్ర వాహన చోదకులు(బైక్ రైడర్ల)కు చాలా డిమాండ్ ఉంది. పదో తరగతి విద్యార్హత, మూడేళ్ల డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు ఉన్న 21 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులు. ఖమ్మం జిల్లాలో ఆసక్తి ఉన్న వారి కోసం ఉపాధి కల్పన శాఖ ఖమ్మం మోడల్ కెరీర్ సెంటర్లో దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించింది. ఆశావహులు వచ్చినప్పటికీ వీరిలో 9 మందికి మాత్రమే పాస్‌పోర్టులున్నాయి. ఇందులోనూ తుది పరిశీలన వరకు ఎందరు మిగులుతారో వేచి చూడాలి. ప్రభుత్వం టామ్‌కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో కొలువులను వెతికి, ఇక్కడి నుంచి వెళ్లేవారికోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. పూర్తి ప్రభుత్వ భద్రత, భరోసాతో అభ్యర్థులను విదేశీ కొలువులకు పంపుతున్నారు.

బైక్ రైడర్లు జిల్లాలో చాలామంది ఉన్నారు. ఆహార డెలివరీ సంస్థల్లో వందల మంది పని చేస్తున్నారు. ముందుగా అవగాహన కల్పించి ఉంటే విదేశీ కొలువులకు వచ్చే వారి సంఖ్య పెరిగేదనే చర్చ ఉంది. వచ్చిన అభ్యర్థుల్లో చాలామంది విదేశాల్లో ఇలాంటి అవకాశాలు ఉ



న్నాయని ముందస్తు సమాచారం ఉంటే అందుకు తగిన విధంగా అన్ని సమకూర్చుకునేవాళ్లమని చెప్పారు. అన్ని అర్హతలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు పాస్‌పోర్టు కావాలంటే రాదు కదా? అని వచ్చిన వారిలో కొందరు నిరాశ వ్యక్తం చేశారు. టామ్‌కామ్ సంస్థ విదేశాల్లో కొలువులు చూపిస్తోందని అంటున్నారు. అందుకు తగిన సమాచారం ఇక్కడ స్థానిక కార్యాలయంలో ఉండటం లేదని, మొత్తం హైదరాబాదులోనే.. ఇక్కడేమీ లేదని చెబుతుంటే కనీస సమాచారం మాకు అందేదెప్పుడని ఒకరిద్దరు ఆవేదన చెందారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి మాధవి పర్యవేక్షించారు.

# అత్యుత్తమ సదుపాయాలు..

## మెరుగైన నిర్వహణ

గోదావరిఖని : విశాలమైన భవనాలు... ఎయిర్ కండీషనింగ్ తరగతి గదులు... మెరుగైన నిర్వహణ... తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణలోని వివిధ వైద్య కళాశాలల్లో చదువుతున్న కేరళకు చెందిన సుమారు 1500 మంది విద్యార్థులు 'తెలంగాణ-మల్లు' పేరిట ఏర్పాటు చేసుకున్న వాట్సప్ గ్రూపుల్లో ఆయా కళాశాలల్లోని వసతులు, విద్యాబోధన తీరును వివరిస్తున్నారు. తాజాగా 2024-25 బ్యాచ్‌లోను కేరళకు చెందిన ఏడుగురు విద్యార్థులు చేరారు. ఉత్తరప్రదేశ్, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాల నుంచి సైతం విద్యార్థులు అధిక సంఖ్యలో చేరారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో 150 సీట్లు ఉండగా అందులో జాతీయ కోటాకు 22 సీట్లు కేటాయించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఆయా రాష్ట్రాల్లోని ప్రముఖ కళాశాలల్లో సీట్లు వచ్చే అవకాశమున్నప్పటికీ గోదావరిఖనిలోని వైద్య కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపారు. రాష్ట్రంలోని 28 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రథమ ప్రాధాన్యతగా గోదావరిఖని వైద్య కళాశాలను ఎంచుకోవడం గమనార్హం. 2024-25 విద్యా సంవత్సరంలో గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చేరిన వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 'న్యూస్‌టుడే'తో పంచుకున్న అంశాలివీ...

సీనియర్ల సూచనలు...



ఇప్పటికే గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుకుంటున్న కేరళకు చెందిన సీనియర్ల ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం. తెలంగాణలోని వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులంతా ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని కళాశాలల నిర్వహణ, వసతులు, బోధనపై చర్చించుకుంటాం. దాని ప్రకారం గోదావరిఖనిలోని వైద్య కళాశాలలో మంచి వసతులు, ఉత్తమ బోధన ఉందని ఎక్కువగా సూచనలు వచ్చాయి. దూరమైనా సరే ఇక్కడే చేరాలనుకున్నాం. ఇక్కడికి వచ్చాక వసతులు చూశాక మరింత సంతృప్తి చెందాం. ప్రిన్సిపల్‌తో పాటు ప్రొఫెసర్లు, వార్డెన్లు, ట్యూటర్లు ఎంతో అప్యాయతగా వ్యవహరిస్తున్నారు.

అతుల్‌కృష్ణ, అనఘ, త్రిషూర్(కేరళ)

ఉత్తమ కళాశాల ఇదే...

జాతీయ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొందాలనుకునే వారు తెలంగాణలో మొట్టమొదటగా గోదావరిఖని వైద్య కళాశాలనే ఎంచుకుంటారు. మా రాష్ట్రానికి చెందిన సీనియర్లు ఇక్కడ ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లో సీటు వచ్చే అవకాశమున్నప్పటికీ గోదావరిఖని వైద్య కళాశాలలో వసతులు, నిర్వహణ తీరు నచ్చడంతో ఇక్కడే చేరాను. రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్‌లోనూ గోదావరిఖని వైద్య కళాశాలకు మంచి గుర్తింపు ఉంది.

అభిషేక్ కార్తికేయన్, ప్రయాగరాజ్(ఉత్తర ప్రదేశ్)

సర్వీసు నిబంధన లేకపోవడంతో...

ఎంబీబీఎస్ పూర్తయిన తర్వాత తప్పనిసరిగా ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేయాలనే నిబంధన లేకపోవడంతో తెలంగాణలోని వైద్య కళాశాలలో చేరాలనుకున్నా. కళాశాల నిర్వహణ, ఫలితాలు, భవనాలు, వసతులు తదితర అంశాలను పరిశీలించాక గోదావరిఖని వైద్య కళాశాలలో చేరడమే ఉత్తమమని నిర్ణయించుకున్నా. ర్యాగింగ్ లాంటి సమస్యలు లేవు. బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించే ప్రొఫెసర్లు ఉండటంతో మొదటి రెండు బ్యాచ్‌లు ఉత్తమ ఫలితాలు సాధించాయి. వీటిని పరిశీలించిన అనంతరం నేను ఇక్కడ చేరా. ఇక్కడ సౌకర్యవంతమైన భవనాలు, వసతులు అందుబాటులో ఉన్నాయి.

సయ్యద్ రేహన్‌అలీ, పూంచ్ (జమ్మూ కశ్మీర్)

# శిక్షణ కేంద్రంలో దుష్టుడు

పాల్వంచ : ఆయనో ఇంజినీరింగ్ అధికారి. తాను పనిచేసే కేంద్రంలో ఉద్యోగినులను వక్రబుద్ధితో చూస్తాడు. శారీరకంగా లోబర్చుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తాడు. మాట వింటే సరి.. లేదంటే వేధింపులను తీవ్రతరం చేస్తాడు. అవసరమైతే తన అధికారంతో వేరేచోటుకు బదిలీ చేసేందుకూ వెనుకాడడు. ఇటీవల కార్యాలయ పని నిమిత్తం ఓ ఉద్యోగిని ఆయన ఛాంబర్‌కు వెళ్లారు. ఆమె టేబుల్ వద్దకు రాగానే ఉన్నట్టుండి అధికారి చేతిలోని పెన్ను కిందపడిపోయింది. దాన్ని తీసివ్వాలన్నది ఆయన హుకుం. పెన్ను తీసిచ్చేంతలోపే ఆయన కళ్లు ఆమె శరీరాన్ని స్కాన్ చేశాయి. అనంతరం ఆయన అసభ్య పదజాలం ప్రయోగించాడు. శిక్షణ కేంద్రంలోని ఓ అధికారి వేధింపులపై ఫిర్యాదు అందినమాట వాస్తవమే. ఆయన ఉద్దేశపూర్వకంగా కొందరిని బదిలీ చేయించినట్లు ఆరోపణలొచ్చాయి. ఈవిషయంపై సదరు అధికారితో మాట్లాడా. యూనియన్ నాయకుల ఫిర్యాదు అంశాన్ని టీజీ జెన్కో రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్‌బాబు, సీఈ, టీజీ జెన్కో శిక్షణ కేంద్రం

వేధింపులు తాళలేక..పాల్వంచలోని టీజీ జెన్కో శిక్షణ కేంద్రం (సీఈటీడీ)లో కొత్త ఉద్యోగులకు నైపుణ్య శిక్షణలిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 13 విద్యుత్కేంద్రాల్లో పనిచేస్తున్న 10వేల మంది ఉద్యోగులకు వృత్తిపరమైన శిక్షణలు ఇక్కడే నిర్వహిస్తుంటారు. సుమారు 50 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా వీరిలో 21 మంది మహిళలే. ఇక్కడ కొన్నేళ్లుగా కీలక అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఓ ఇంజినీర్ వ్యవహార శైలిపై దుమారం చెలరేగుతోంది. ఉద్యోగినులను లైంగికంగా వేధిస్తున్నారు. తన దారికి వస్తే సరి, లేదంటే బదిలీ చేసి కక్షసాధిస్తున్నారు. చాలామంది బాధితులు పరువు పోతుందనో? కుటుంబ సభ్యుల కోసమనో ఇన్నాళ్లు పెదవి విప్పలేదు. ఇటీవల ఇద్దరు ఉద్యోగినులు ఓ సంఘం నాయకుల వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. ఆవేదనతో కంటతడి పెట్టారు. స్పందించిన నాయకులు కేంద్రం చీఫ్ ఇంజినీర్(సీఈ)తో మాట్లాడారు. అధికారిపై ఫిర్యాదిచ్చారు. ఇదే సమయంలో బాధిత ఉద్యోగినులు తమకు ఎదురైన వేధింపులు, జరుగుతున్న అన్యాయంపై నోరువిప్పారు. సదరు కీచక అధికారి కంట్లో పడటం ఇష్టం లేనివారు కొందరు బదిలీ చేయించుకున్నట్లు సమాచారం.

# పుస్తకాలకూ.. పరీక్షే!


వికారాబాద్ : పోటీ పరీక్షలొస్తున్నాయంటే నిరుద్యోగులు సమీప గ్రంథాలయాలకు (లైబ్రరీలు) వెళ్తుంటారు. కొందరు ఇళ్లకు తీసుకువెళ్తారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్మీ, నేవీ, స్టాఫ్ సెలక్షన్, గ్రూప్స్, పోలీసు, వైద్య, తదితర విభాగాల్లో నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని వెలువడ్డాయి. ఆర్థికంగా ఖర్చు పెట్టగలిగిన వారు హైదరాబాద్ వెళ్లి హాస్టల్‌లో ఉంటూ శిక్షణ పొందుతారు. కానీ పూర్తి గ్రామీణ ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలో అంత ఖర్చు చేయగలిన వారు చాలా తక్కువ. అందుకే అధిక శాతం సమీప లైబ్రరీలపైనే ఆధారపడుతున్నారు. కానీ జిల్లాలోని లైబ్రరీల్లో తగిన స్థాయిలో పుస్తకాలు లేవని నిరుద్యోగులు వాపోతున్నారు.

365 రోజులు తెరిచే ఉంటుంది

వికారాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం 365 రోజులు తెరచి ఉంచుతున్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పనిచేస్తుంది. ఇదొక్కటే కాదు తాండూరు, పెద్దేముల్, పరిగి గ్రంథాలయాలు కూడా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తున్నాయి. జిల్లాలో పాఠకులు వారికి అవసరమైన పుస్తకం గ్రంథాలయంలో దొరకనప్పుడు వెంటనే గ్రంథ పాలకుడిని కలిసి ఫలానా పుస్తకం కావాలని అని తెలిపితే వారంలో తెప్పిస్తున్నారు.

సమస్యల వలయం

తాండూరులోని శాఖా గ్రంథాలయం సమస్యల వలయంగా మారింది. ఇక్కడ పాఠకులకు పూర్తి స్థాయిలో వసతులు లేక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంతో పాటు నియోజక వర్గంలోని



మండలాల యువతకు ఇక్కడకు వస్తుంటారు.

ఉచిత శిక్షణ తరగతులకు గతంలో నేతల చొరవ

పరిగి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం గ్రూప్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీచేసినప్పుడు పరిగి, తాండూరు, వికారాబాద్ పట్టణ కేంద్రాల్లో ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి నిపుణులను పిలిపించి తరగతులు నిర్వహించారు. భోజనంతోపాటు పుస్తకాలు కూడా అందించారు. వీటివల్ల గ్రామీణ యువతకు కొంత మేరైనా మేలు చేకూరింది. ఈసారి కూడా అదే తరహాలో శిక్షణ తరగతులు ఏర్పాటుచేసి చేయూత నివ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

జిల్లాలో గ్రంథాలయాల సమాచారం
జిల్లా కేంద్ర గ్రంథాలయం: 1 (వికారాబాద్)
గ్రేడ్ 2: 2 (తాండూరు, పరిగి)
గ్రామీణ గ్రంథాలయాలు: 17
అన్నింటా పుస్తకాలు : 3.40 లక్షలు
జిల్లా గ్రంథాలయంలో : 83 వేలు
పోటీ పరీక్షలకు సంబంధించినవి : 11 వేలు
నిత్యం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వచ్చే
పాఠకులు: 200 మందికి పైగా..

క్లర్క్ నుంచి కలెక్టర్ పోస్ట్ వరకు సాధన పుస్తకాలున్నాయి

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో క్లర్క్ నుంచి కలెక్టర్ పోస్టు సాధన వరకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. నెట్ కనెక్షన్‌లో ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు ఉచితంగా నెట్ సౌకర్యాన్ని వాడుకోవచ్చు. రాత్రి పూట ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డును కూడా ఏర్పాటు చేశాం. – పి.సురేశ్‌బాబు, కార్యదర్శి గ్రంథాలయ సంస్థ, వికారాబాద్.

# పత్తి కొనుగోళ్లకు కసరత్తు

నల్గొండ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి దిగుబడులు మొదలు కావడంతో కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) కసరత్తు చేస్తోంది. రైతులు తీసుకువచ్చిన సరకును ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే వ్యాపారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో గత రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మొగ్గు చూపలేదు. కేంద్రం ఈ ఏడాది పొడువు గింజ పత్తి క్వింటాకు రూ.7,521, మధ్యస్థ గింజ పత్తికి క్వింటాకు రూ.7,121గా మద్దతు ధరలను ప్రకటించింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో క్వింటాలు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతోంది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ఇప్పుడు సుమారు రూ.2 వేల వరకు ఎక్కువ ఉండటంతో రైతులు బహిరంగంగానే అమ్మడానికి మొగ్గు చూపుతున్నారు. అయితే కొనుగోళ్లు మొదలైన తర్వాత వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తే రైతులు నష్టపోతారన్న ఉద్దేశంతో తొలి దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చండూరు, మునుగోడు, నల్గొండ, దేవరకొండ, కొండమల్లేపల్లి, సూర్యాపేట, భువనగిరి, తిరుమలగిరి, ఆలేరు, నాంపల్లి లాంటి ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటుకు సీసీఐ మొగ్గు చూపుతోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి 50కి పైగా జిన్నింగ్ మిల్లులుండగా.. ఆయా జిల్లాల కలెక్టర్ల అధ్యక్షతన మార్కెటింగ్, తూనికలు, కొలతలు, వ్యవసాయ శాఖలకు చెందిన అధికారులు ఈ కేంద్రాల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు. వచ్చే నెల మొదటి నుంచి దిగుబడులు రానున్న నేపథ్యంలో ఇప్పటికే కొనుగోళ్లకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఎక్కడెక్కడ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న విషయంపై నాలుగైదు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

7.18 లక్షల ఎకరాలు... 65 లక్షల క్వింటాళ్లు

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో మూడు జిల్లాల్లో కలిపి 7,18,765 ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. ఇది గతేడాది కంటే 60 వేల ఎకరాలు తక్కువ. గతేడాది నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి 7.82 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ పత్తి పంట బాగుంది. ఇటీవలి వర్షాలకు సూర్యాపేట జిల్లాల్లో కొంత దెబ్బతిన్నా ఉమ్మడి జిల్లాలో ఎకరాకు సగటున 8 క్వింటాళ్ల నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. మునుపటి కంటే ఈ ఏడాది పత్తి పైరు ఎదుగుదల బాగుందని.. చీడపీడల బెడద సైతం తగ్గిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దిగుబడులు 65 లక్షల క్వింటాళ్ల వరకు ఉండొచ్చన్న అంచనాలున్నాయి.

ఏర్పాట్లు చేస్తున్నాం – ఛాయాదేవి, ఏడీ, మార్కెటింగ్ శాఖ, నల్గొండ జిల్లా

పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకు రైతుల నుంచి కొనుగోళ్లు చేయకుండా వ్యాపారులపై నిఘా పెట్టాం.

# పోడు ఆశ.. అడవితల్లికి గుండెకోత



రుద్రంగి: జీవనోపాధి లేని నిరుపేద గిరిజన, గిరిజనేతరులకు ప్రభుత్వం పోడు భూములపై హక్కులను కల్పించింది. ఇప్పుడు ఇదే అటవీ భూముల అన్యాక్రాంతానికి కారణమవుతోంది. శత వసంతాలు విరాజిల్లిన వృక్షరాజాలు, కనువిందు చేసే పచ్చని చెట్లు కోత మిషన్ల ధాటికి కనుమరుగవుతున్నాయి. వన్యజీవులకు ఆవాసంగా ఉన్న ప్రాంతం నేడు చెట్లు లేక వెలవెలబోతోంది.

రుద్రంగి మండల కేంద్రం, మండలంలోని ఉమ్మడి మానాలలో దశాబ్దం నుంచి సుమారు 4 వేల ఎకరాల అటవీ ప్రాంతం ప్రస్తుతం పంట చేలుగా మారింది. అటవీ ప్రాంతం చదును చేసే ఇంకా ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. 2023లో అప్పటి భారాస ప్రభుత్వం సుమారు 1,700 ఎకరాల పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసింది. ఈ హక్కులు తమకు కూడా వర్తిస్తాయనే ఉద్దేశంతో నిత్యం కోత మిషన్లతో చెట్లను నేల కూల్చుతున్నారు.

రుద్రంగి– మానాల అటవీ ప్రాంతంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వందలాది చెట్లను కోత మిషన్లతో కోస్తూ, ట్రాక్టర్లతో చదును చేస్తున్నారు. సహజ అడవులు పునరుద్ధరణలో భాగంగా మానాల– భీంగల్ మధ్య రెండు దశాబ్దాల క్రితం పెంచిన నీలగిరి చెట్లను సైతం ఇటీవల అక్రమార్కులు నరికేశారు.

ఉమ్మడి మానాలలో కొందరు సుమారు 30 నుంచి 50 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించినా వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొందరు ప్రజాప్రతినిధులు జిల్లా అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేడు.

రుద్రంగికి అనుబంధంగా ఉన్న కొచ్చెగుట్ట తండా, గువ్వల బండా తండా, దసరానాయక్ తండా పరిసరాల్లో వందలాది ఎకరాల అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి.

ఇలా చేస్తే మేలు..

అటవీ ప్రాంతాల్లోకి చదును చేసే వాహనాలు వెళ్లకుండా కందకాలు తవ్వాలి. అన్ని సామాజిక వర్గాలతో అటవీ పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి.

ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో పండ్ల మొక్కలు నాటితే కోతులు మళ్లీ అడవి బాట పట్టేందుకు అవకాశం ఉంటుంది.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది 2021–22లో కంపా పథకంలో భాగంగా సహజ అడవుల పునరుద్ధరణ పేరిట 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. 2022లో అటవీ భూమి కోతకు గురికావద్దని, వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు, భూగర్భ జలాల పెంపు కోసం మూడు నీటి కుంటలను నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ 50 ఎకరాల్లో పత్తి చేను దర్శనమిస్తోంది.

జనాల్లోకి వన్యప్రాణులు

అటవీ ప్రాంతం నానాటికీ క్షీణించడంతో సురక్షితమైన ప్రాంతాలు కరవై వన్యప్రాణులు జనావాసాలు, పంట చేలల్లోకి వస్తున్నాయి. చిరుతలు, ఎలుగుబంట్లు, మనుబోతులు, కోతులు, దుప్పిలు, జింకలు, నెమళ్లు వంటివి పంట పొలాల్లోకి తరచూ వస్తున్నాయి.

కేసులు నమోదు చేస్తున్నాం

మా పరిధిలో అడవుల అన్యాక్రాంతానికి సంబంధించిన కారకులను పట్టుకుని కేసులు పెడుతున్నాం. కొందరిని బైండోవర్ చేశాం. మా సిబ్బంది ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇతర శాఖలు, ప్రజాప్రతినిధుల నుంచి సరైన సహకారం లేకపోవడంతో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉంది. రాఘువేందర్‌రావు, డిప్యూటీ రేంజ్ అధికారి, చందుర్తి

నిఘా పెట్టాంమా సామర్థ్యం మేర అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు నిఘా ఉంచాం. ప్రజల మద్దతు ఉంటేనే అడవుల రక్షణ పూర్తిగా సాధ్యమవుతుంది. మానాల–భీంగల్ మధ్యలో ఆక్రమణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేశాం. కొందరిని ఇంకా గుర్తించాల్సి ఉంది. గౌసొద్దీన్, సెక్షన్ అధికారి, భీంగల్

# ఆధునిక యంత్రం.. ఉపాధి అంతంతమాత్రం



సిరిసిల్ల: ఏళ్ల తరబడి ఒకే వృత్తిని నమ్ముకుని ఉండటం.. అందులోనూ డిటర్జంట్లు.. రసాయనాలు కలిసిన నీళ్లతో దుస్తులు ఉతకడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. దీని ప్రభావంతో చాలా కుటుంబాలు రజక వృత్తికి దూరమవుతున్నాయి. పైగా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాక వీరికి ఉపాధి కూడా కరవవుతోంది. దీంతో చాలా మంది యువకులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రజకుల్లో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఆధునిక ధోబీఘాట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆశయం మంచిదే అయినా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు.

కొరవడిన ప్రచారం

రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా సిరిసిల్ల పట్టణంలో రూ.1.38 కోట్లతో ఆధునిక ధోబీ ఘాట్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో రోజుకు రెండు షిఫ్టుల్లో 16 సైకిల్స్‌లో 3,840 దుస్తులు ఉతికి, ఆరేసి, ఇస్త్రీ చేసే వీలుంది. దీని పరిధిలో 30 కుటుంబాలకు నిరంతర ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం రెండ్రోజులకు ఒకసారి కూడా ఒక షిఫ్టునకు పూర్తిగా సరిపడినన్ని దుస్తులు రావడం లేదు. విస్తరిస్తున్న సాంకేతికత ఓవైపు.. అందుకు తగ్గట్లుగా ప్రచారమూ కొరవడటంతో రజకుల ఉపాధిపైన ప్రభావం చూపుతోంది. ఇక్కడ పూర్తిస్థాయి లక్ష్యం చేరుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా మరో 18 చోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం ప్రణాళికలు చేసింది.

వీటి నిర్వహణకు రాష్ట్రంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ అవి కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలైన వసతి గృహాలు, గురుకులాలు, ఆసుపత్రులు, లాడ్జీల్లో వస్త్రాలు తీసుకొచ్చి ఉతికి ఇచ్చేలా ధోబీఘాట్‌పై ప్రచారం చేయలేదు. రజకులకు పని భారం తగ్గడంతోపాటు తక్కువ సమయంలో ఎక్కువ దుస్తులు ఉతికి ఉపాధిని మరింతగా విస్తరించుకునే అవకాశాలు అందిపుచ్చుకోవడం లేదు.

అధికారుల సహకారం అవసరం

తరతరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని అనేక కుటుంబాలు జీవిస్తున్నాయి. గురుకులాలు, కళాశాలకు వెళ్లి దీనిపై వివరించాం. వాటిలో పని చేసేవారికి ఆధునిక ధోబీ ఘాట్ సామర్థ్యం గురించి చెప్పాం. వారే నేరుగా దుస్తులు తీసుకొచ్చి ఉతుక్కొని తీసుకెళ్లవచ్చు. వారికి ఉపాధి గిట్టుబాటయ్యేలా మాట్లాడుతామని చెప్పాం. జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలలు, వసతి గృహాలు ఈ ధోబీఘాట్‌ను వినియోగించేలా అధికారులు సహకరించాలి. కాసర్ల లక్ష్మయ్య, రజక సంఘం అధ్యక్షుడు

# పల్లెల్లో స్వచ్ఛతా హీ సేవా

రాజపేట : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో వీధులు పిచ్చిమొక్కలకు, దోమలకు నిలయంగా మారాయని చెప్పవచ్చు. ఫలితంగా జ్వరాలతో పల్లెలు విలవిలలాడుతున్నాయి. దీన్ని నిలువరించే క్రమంలో పక్షం రోజుల పాటు ప్రభుత్వం పల్లెల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. ముఖ్యంగా 'మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతోనే స్వచ్ఛ గ్రామాలుగా రూపుదిద్దుకుంటాయని' మహాత్మాగాంధీ ఆనాడే చెప్పిన విషయం తెలిసిందే. ఆ మహాత్ముని జయంతి వేడుకల సందర్భంగా ప్రతి పంచాయతీల్లో స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన అంశాల వారీగా నిర్వహించడానికి సంబంధిత అధికారులు సన్నద్ధమవుతున్నారు.

పారిశుద్ధ్య చర్యలకు ప్రాధాన్యం

ఉమ్మడి జిల్లాలోని పల్లెల్లో 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధాన కూడళ్లు, ప్రజోపయోగ స్థలాలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్త, మురుగును తొలగించనున్నారు. స్వచ్ఛంద సంస్థలు, యువన సంఘాలు, ప్రజల శ్రమదానంతో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని నిర్ణయించారు. కంపోస్టు షెడ్‌లలో తడి, పొడి చెత్త వేరు చేయాలి. చెత్త నుంచి ప్లాస్టిక్, గాజు, ఇతర వస్తువులను వేరు చేయాలి. మిగిలిన తడిచెత్త వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చాలి. చివరి రోజైన అక్టోబరు 2న నిర్వహించే గ్రామసభల్లో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ప్రత్యేక తీర్మానాలు చేయాలి. వస్త్ర సంచులు వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

స్వచ్ఛత ప్రాధాన్యంపై విద్యాలయాల్లో క్విజ్ పోటీల నిర్వహణ, విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలి.

# బాహ్య వలయం.. అయోమయం

తాండూరు : వాణిజ్య ప్రాంతంగా పేరొందిన తాండూరుకు ఎనిమిదేళ్ల క్రితం తొలిసారిగా బాహ్యవలయ రహదారి మంజూరైంది. భారీ వాహనాలన్నీ ఇదే మార్గంలో వెళ్లేందుకు అవకాశం కలుగుతుందని, ట్రాఫిక్ సమస్యలు తీరడంతోపాటు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని అంతా సంబురపడ్డారు. కానీ సంవత్సరాలు గడిచినా రహదారి నిర్మాణం పూర్తి కాలేదు. పూర్తి చేసిన దారిలో వాహనాల ప్రయాణాన్ని ప్రారంభికపోవడంతో లక్ష్యం నెరవేరడంలేదు. వెరసి నియోజకవర్గంలో 3లక్షల మందికి అవస్థలు తప్పడం లేదు.

2016లో మంజూరు

జిల్లాలో మొదటిసారి తాండూరుకు 2016లో బాహ్యవలయ రహదారి మంజూరైంది. తాండూరు మండలం గౌతాపూర్ శివారులో తాండూరు గ్రామీణ సీఐ కార్యాలయం పక్కన జాతీయ రహదారి నుంచి చెంగోల్, అంతారంతండా, భూకైలాష్, అంతారం, ఖాంజాపూర్ గేటు, యాలాల మండలం రాజీవ్ గృహకల్ప, బషీర్‌మియా తండా, రాశులపురం శివారులో జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు చేపట్టారు. గౌతాపూర్ శివారు నుంచి ఖాంజాపూర్ గేటు వద్ద హైదరాబాద్ రహదారి పనులకు రెండు వరసల్లో తారు పనులు పూర్తయ్యాయి.



పట్టణం, పరిసర గ్రామాల్లోకి రాకుండా..

నిర్మాణం పూర్తయిన వరకు బాహ్యవలయ రహదారిని అందుబాటులోకి తెస్తే మల్కాపూర్, కొత్లాపూర్, కోటబాస్పల్లి, సంగెంకలాన్, జిన్‌గుర్తితో పాటు సరిహద్దునున్న కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చే వాహనాలు, సిమెంటు, నాపరాయి లారీలు, ట్యాంకర్లు పట్టణంలోకి ప్రవేశించకుండా బాహ్యవలయ రహదారి మీదుగా వెళ్లేందుకు ఆస్కారముంటుంది.

నత్తనడకన పనులు

బషీర్‌మియాతండా నుంచి రాశులపురం వరకు చేపట్టిన పనులు రహదారులు భవనాల శాఖ అధికారుల అలసత్వంతో మూడు సంవత్సరాలు దాటినా పూర్తి కాలేదన్న విమర్శలొస్తున్నాయి. 5 కి.మీ. మార్గంలో మట్టి, కంకర పనులకే పరిమితం చేశారు. తారు పనులు పూర్తి చేయించి అందుబాట్లోకి తెస్తే మహబూబ్‌నగర్ నుంచి వచ్చే వాహనాలు పట్టణంలోకి ప్రవేశించకుండా నేరుగా బాహ్యవలయ రహదారిగుండా వెళ్లేందుకు తోడ్పడుతుంది.

పరిహార సమస్య పరిష్కరిస్తేనే అందుబాటు

అంతారం తండా వద్ద కొద్ది దూరం తారు పనులు మినహ మిగిలి దారి నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర గడుస్తోంది. కొందరు రైతులు పరిహారం అందించలేదంటూ పేచీ పెట్టారు. వీరి సమస్యను పరిష్కరిస్తే తాండూరు–చించోళి మార్గం నుంచి హైదరాబాద్ రహదారి వరకు 8 కి.మీ. బాహ్యవలయ రహదారి అందుబాటులోకి తెచ్చే వీలుంటుంది.

బాహ్యవలయ రహదారి: 13 కి.మీ.
మంజూరైన నిధులు: రూ.78కోట్లు
ఖర్చు చేసింది: రూ.39కోట్లు

# ఎయిర్‌టెక్ అక్రమాలకు జీపీఎస్ కళ్లెం!

హైదరాబాద్ : గ్రేటర్ పరిధిలోని ఎయిర్‌టెక్ యంత్రాల పనితీరుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకు జలమండలి సిద్ధమైంది. ప్రతి యంత్రం ఎక్కడ ఉంది.. ఎలా పనిచేస్తుందో లెక్కలు తేల్చాలని ఎండీ అశోక్‌రెడ్డి నిర్ణయించారు. గ్లోబల్ పొజిషినింగ్ సిస్టమ్ (జీపీఎస్)తో ఈ యంత్రాలను అనుసంధానించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రధాన నగరంతోపాటు శివార్ల మున్సిపాలిటీల్లో మురుగు నీటి నిర్వహణ జలమండలి పరిధిలో ఉంది. 2016 నుంచి పారిశుద్ధ్య కార్మికులు మ్యాన్‌హోళ్లలోకి దిగకుండా నిషేధించింది. మాన్యువల్ క్లీనింగ్ నుంచి యంత్రాలకు మారింది. దేశంలోనే మొదటిసారిగా 2017లో మినీ సివర్ జెట్టింగ్ యంత్రాలను ఆవిష్కరించింది. ప్రస్తుతం గ్రేటర్‌వ్యాప్తంగా పెద్ద, చిన్న యంత్రాలు కలిపి 225వరకు అందుబాటులో ఉన్నాయి. వీటికి ఏటా రూ.15 కోట్ల వరకు అద్దెగా బిల్లులు చెల్లిస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మురుగు పొంగడంపై జలమండలి కస్టమర్ కేర్‌కు నెలకు 30–40 వేల ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ యంత్రాలతో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో 2–3 రోజులకు కూడా ఈ యంత్రాలు రావడం లేదంటున్నారు. యంత్రాలు అందుబాటులో లేక స్థానిక సిబ్బంది కర్రలను ఉపయోగించి మ్యాన్‌హోళ్లలో మురుగు కదిలేలా చేస్తున్నారు. ఒక్కో డివిజన్‌కు నాలుగు వంతున యంత్రాలను కేటాయించినా ఆయా



ప్రాంతాల్లో క్లీనింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి ఎయిర్‌టెక్ యంత్రం నిత్యం 500 రన్నింగ్ మీటర్ల వరకు మురుగు గొట్టాలు, మ్యాన్‌హోళ్లు శుభ్రం చేయాలి. ఆ స్థాయిలో పనులు జరగడం లేదు.

సాంకేతిక నిఘా

ఇక నుంచి ప్రతి ఎయిర్‌టెక్ యంత్రానికి జీపీఎస్ పరికరాలను అమర్చి ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించనున్నారు. కొన్ని యంత్రాలు ప్రైవేటు వ్యాపార, వాణిజ్య సంస్థల వద్దకు వెళ్లి మురుగు శుభ్రం చేస్తున్నాయి. యంత్రాల్లో కొన్ని రాజకీయ నాయకులకు అనుచరుల ఉన్నాయి. జీపీఎస్‌తో ఇలాంటి వాటికి చెక్ పెట్టవచ్చని చెబుతున్నారు. నగరంలో ఇంకా నిజాం నాటి మురుగు, పైపులైన్ల వ్యవస్థే ఆధారం. చాలా ప్రాంతాల్లో మురుగునీటి పైపుల కిందనుంచి మంచినీటి పైపులు వెళుతున్నాయి. లీకేజీలతో మురుగు నీరు మంచి నీటి పైపుల్లోకి చేరి.. కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. మురుగు గొట్టాల క్లీనింగ్ అత్యంత అవసరం కానున్న దృష్ట్యా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నారు.




'డిజిటల్ అరెస్టు'ల పేరిట ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను ప్రధాని మోదీ ఏకంగా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో అందరి దృష్టి వీటిపై పడింది. ఇటీవల వీటికి సంబంధించిన కీలక సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో దాదాపు 46% మూడు దేశాల నుంచే జరుగుతున్నట్లు గుర్తించారు. వాటిల్లో పొరుగున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తంగా బాధితులు దాదాపు రూ.1,776 కోట్లు నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి. అత్యధికంగా ట్రేడింగ్ స్కామ్‌ల్లో రూ.1,420 కోట్లు, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మోసాల్లో రూ.222.58 కోట్లు, డిజిటల్ అరెస్టుల్లో రూ.120.3 కోట్లు, డేటింగ్/రొమాన్స్ పేరిట రూ.13.23 కోట్లు పోగొట్టుకొన్నారు. వీటి సంఖ్య ఏటా పెరిగిపోతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఆన్‌లైన్ మోసాలపై ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ 30 నాటికే మొత్తం 7.4 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇక 2023లో 15.56 లక్షలు, 2022లో 9.66 లక్షలు, 2021లో 4.52 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై ఇండియన్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. "ఈ దేశాల్లో సైబర్ క్రైమ్ బృందాలు సమగ్రమైన మోసపూరిత వ్యూహాలను అమలుచేస్తాయి. వీటికోసం అవి తప్పుడు ఎంప్లాయిమెంట్ అవకాశాలను చూపిస్తూ రిక్రూట్‌మెంట్ చేసుకొంటాయి" అని వివరించారు.

**హైదరాబాద్‌లో 24గంటల పాటు టెకీ డిజిటల్ అరెస్ట్..!** హైదరాబాద్‌కు చెందిన 44 ఏళ్ల టెకీని సైబర్ నేరగాళ్లు బెదిరించి 24 గంటలు డిజిటల్ అరెస్టు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి నుంచి మెసేజ్‌లు వచ్చినా అవి స్పామ్ అని అతడు పట్టించుకోలేదు. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు ఓ ప్రముఖ కొరియర్ ఏజెంట్, ముంబయి పోలీసులు ఫోన్లు చేస్తున్నట్లుగా అతడికి ఫోన్లు వచ్చాయి. అతడి ఆధార్ నెంబర్‌కు మనీలాండరింగ్‌తో సంబంధం ఉందని పేర్కొన్నారు. ఖాతాను చెక్ చేసేవరకు వాట్సాప్ వీడియోకాల్‌లో కొనసాగాలని కోరారు. దీంతోపాటు అతడిని ఇంటినుంచి దూరంగా వచ్చి ఓ లాడ్జిలో ఉండాలని సూచించారు. ఇది సోమవారం ఉదయం బ్యాంకులు తెరిచేవరకు ఉండాలని వారు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల వరకు ఈ వ్యవహారం కొనసాగింది. హఠాత్తుగా కాల్ కట్ కావడంతో.. బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు అతడిని సురక్షితంగా తిరిగి కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. అదృష్టవశాత్తూ బ్యాంకులు మూసి ఉండటంతో అతడి ఖాతా నుంచి డబ్బులు పోలేదు.




ముంబయి: దేశీయ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. విదేశీ మదుపర్ల అమ్మకాలు, బలహీన త్రైమాసిక ఫలితాల కారణంగా గత ఐదు సెషన్లలో నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం బలంగా పుంజుకున్నాయి. ఆసియా మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలు, కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో బుల్ మళ్లీ పరుగులు పెట్టింది. ఫలితంగా సెన్సెక్స్ మళ్లీ 80వేల మైలురాయిని దాటగా.. నిఫ్టీ 24,300 పైన స్థిరపడింది. ఈ ఉదయం సెన్సెక్స్ 79,653 వద్ద ఉత్సాహంగా ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా అదే జోరు కొనసాగించింది. ఒక దశలో 1100 పాయింట్లకు పైగా లాభపడి 80,539.81 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. చివర్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడటంతో కాస్త ఒత్తిడికి గురైనప్పటికీ రాణించింది. మొత్తంగా మార్కెట్ ముగిసే సమయానికి 602.75 పాయింట్లు ఎగబాకి 80,005.04 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 24,134 - 24,492 మధ్య కదలాడి చివరకు 158.35 పాయింట్ల లాభంతో 24,339.15 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.07 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐషర్ మోటార్స్, విప్రో షేర్లు రాణించాయి. కోల్ ఇండియా, బజాజ్ ఆటో, యాక్సిస్ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హీరో మోటార్స్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీ 3.8శాతం, లోహ సూచీ 2.5శాతం మేర పెరిగాయి.

**ర్యాలీకి కారణాలు ఇవే..** స్టాక్‌మార్కెట్ సూచీలు ఇటీవల వరుస నష్టాలు చవిచూశాయి. నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటే జీవనకాల గరిష్ఠాల నుంచి దాదాపు 8 శాతం మేర కుంగింది. ఇదే అవకాశంగా భావించి మదుపర్లు కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు జరపడం నేటి ర్యాలీకి ప్రధాన కారణంగా అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. ఆసియా మార్కెట్లు లాభాల్లో ప్రారంభమవడంతో దేశీయ మార్కెట్ సూచీలు అదే బాటలో పయనించాయి. జపాన్ నిక్కీ భారీ లాభాల్లో కొనసాగగా.. ఆస్ట్రేలియా, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లూ పాజిటివ్‌గా కదలాడాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడమూ మరో కారణం. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసినప్పటికీ.. చమురు, న్యూక్లియర్ వంటి వాటి జోలికి పోకపోవడంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఆందోళన కొంతమేర తగ్గింది. దీంతో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ సోమవారం 3 డాలర్ల మేర క్షీణించి 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## తప్పులన్నీ మీరు చేసి.. కూటమి ప్రభుత్వంపై విమర్శలా?: జగన్‌కు గొట్టిపాటి కౌంటర్



అమరావతి: వైకాపా అధినేత జగన్‌కి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కౌంటర్ ఇచ్చారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై మాట్లాడే కనీస అర్హత మీకు ఉందా? అని ప్రశ్నించారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీని అప్పగిస్తే వ్యక్తిగత స్వార్థంతో నాశనం చేసింది మీరు కాదా అని ధ్వజమెత్తారు. వైకాపా అసమర్థ పాలన, అస్మదీయులకు దోచిపెట్టింది వాస్తవం కాదా అని నిలదీశారు. పీపీఏలను రద్దు చేయడం, ఉత్పత్తిదారులను భయపెట్టడంతో కేంద్ర ప్రభుత్వం, విదేశీ బ్యాంకుల వద్ద రాష్ట్రం పరువు పోవడానికి మీరు కారణం కాదా జగన్.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"2022-23, 2023-24 సంవత్సరాలకు గాను ఇంధన సర్దుబాటు ఛార్జీలను ప్రజలపై మోపాలని డిస్కంలకు అనుమతి ఇచ్చింది మీరే కదా. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల రక్తం తాగారు. అలాంటి మీరు చంద్రబాబు పాలనను విమర్శించడమేంటి? మీరు చేసిన తప్పిదాలతోనే కదా అనవసరంగా హిందూజా పవర్‌కు రూ.1200 కోట్లు కట్టాల్సి వచ్చింది. వైకాపా హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. పోలవరం పూర్తి చేస్తానన్నారు.. చేయలేదు. మూడు రాజధానులు నిర్మిస్తానని చెప్పి రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించారు. తప్పులన్నీ మీరు చేసి.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడమేంటి?" అని ప్రశ్నించారు.

## విజయవాడ ధర్నాచౌక్‌లో అగ్రిగోల్డ్ బాధితుల మహా విజ్ఞాపన దీక్ష

విజయవాడ: నగరంలోని ధర్నాచౌక్‌లో అగ్రిగోల్డ్ బాధితులు మహా విజ్ఞాపన దీక్ష చేపట్టారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక, మానసిక ఒత్తిడితో



ఉన్న బాధితులకు సత్వరమే డిపాజిట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు తెలిపారు. కమిటీలో సమర్థులైన అధికారులను ఉంచాలన్నారు. 26 జిల్లాల్లో తిరిగి బాధితుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని కోరారు.

## జగన్ సీఎంగా ఉన్నప్పుడు ధనవంతుల్నే కలిసేవారు



అమరావతి: జగన్ తన పదవీకాలమంతా వసూళ్లతోనే గడిపారని ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్ విమర్శించారు. 'ఎక్స్'లో వైకాపా చేసిన పోస్టుపై ఆయన ఘటుగా స్పందించారు. ప్రజా సమస్యలపై పరిష్కారమే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత అంటూ వైకాపా 'ఎక్స్'లో పోస్టు చేసింది. దీనికి మాణికం ఠాగూర్ "జగన్ సీఎంగా ఉన్నప్పుడు ధనవంతుల్నే కలిసేవారు. పదవీ కాలమంతా వసూళ్లతోనే బిజిబిజీగా గడిపారు. ప్రజా దర్బార్ పేరిట సమస్యలు తెలుసుకునే ఆలోచనే చేయలేదు. నిజానికి జగన్ ఎప్పుడూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని అనుసరించలేదు" అని పేర్కొన్నారు.



## ఏపీ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

**అమరావతి: ఏపీ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. వారితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. హైకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ మహేశ్వరరావు కుంచం, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ ప్రమాణం చేశారు.**

## తెదేపా కార్యాలయంపై దాడి కేసు.. ప్రధాన నిందితుడికి రిమాండ్ పొడిగింపు



మంగళగిరి: తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి ఘటనలో ఏ1గా ఉన్న పానుగంటి చైతన్యకు న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ పొడిగించింది. మూడు రోజుల సీఐడీ కస్టడీ ముగియడంతో అధికారులు సోమవారం గుంటూరులోని 6వ అదనపు న్యాయస్థానం ఎదుట నిందితుడిని హాజరుపరిచారు. మూడు రోజుల కస్టడీలో అధికారుల ప్రశ్నలకు చైతన్య స్పందించలేదని, అన్నింటికీ తెలియదు, గుర్తులేదు, మర్చిపోయాననే సమాధానాలిస్తూ.. విచారణకు సహకరించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఈ నేపథ్యంలో న్యాయస్థానం చైతన్యకు మరో రెండు వారాలు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు అతడిని కోర్టు నుంచి విజయవాడ జైలుకు తరలించారు.

## అన్ని రాజకీయ పార్టీలకంటే బీజేపీ భిన్నమైన పార్టీ: పురందేశ్వరి

విజయవాడ: బీజేపీ పార్టీ అన్ని రాజకీయ పార్టీలకంటే భిన్నమైనదని, ప్రతి ఆరు నెలలకొకసారి కొత్త సభ్యులను చేర్చుకోవటంతో పాటు బూత్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులను ప్రజా స్వామ్యం పద్ధతి ద్వారా ఎన్నుకుని ముందుకి వెళుతున్నామని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం, విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీతో సహ అందరూ వారి సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవటం జరుగుతుందన్నారు. 2014 లో ఆరు నెలల పాటు సభ్యత్వాన్ని నమోదు చేసామని, ఆన్‌లైన్ ద్వారా మొదటి సారి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. గతంలో 11కోట్ల సభ్యత్వాన్ని ఆరునెలలో చేసామని, ఇప్పుడు 45 రోజుల్లో 22 లక్షల సభ్యత్వాన్ని నమోదు చేసామని పురందేశ్వరి తెలిపారు. భవిష్యత్‌లో బీజేపీ ఒక బలమైన రాజకీయ పార్టీగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్క కార్యకర్త పని చేస్తున్నందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. జాతీయ స్థాయిలో పరిపాలనా దక్షత కనభరిచారో దేశాన్ని అగ్ర గామిగా నిలబెట్టిన ఘనత ప్రధాని మోదీదేనని కొనియాడారు. ఏపీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో కేంద్రం సహాయ సహకారాలు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. తాజాగా కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ రాష్ట్ర రాజధాని అమరావతి కనెక్టివిటీ కొరకు రైల్వే నిర్మాణం చేపట్టడం సంతోషకరమని అన్నారు. కాగా రోడ్ల నిర్మాణం కోసం కేంద్రం సహకారం అందిస్తుందని, 12,500 కోట్ల రూపాయలు పోలవరం పూర్తి చేయటానికి నిధులు కేటాయిస్తామని పురందేశ్వరి హామీ ఇచ్చారు. 900 కోట్ల పై చిలుకు దెబ్బతిన్న డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం సాయం అందిస్తామని తెలియచేసారు. గ్రామ సభల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ పర్యటించి కేంద్రం అందిస్తున్న సహాయ సహకారాల గురించి తెలియచేసారని, గత ప్రభుత్వంలో కేంద్రం ఇచ్చిన నిధులను పక్క దారి పట్టించిన విధానాన్ని పవన్ కళ్యాన్ సైతం గ్రామ సభల్లో వివరించారన్నారు. దేశంలో ఎన్డీయే ఉండాలని, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఉండాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ఏపీ రాష్ట్ర ప్రజలందరూ ఈ రోజు పండగ చేసుకోవాల్సిన అవసరం ఉందని.. డబల్ ఇంజిన్ సర్కార్ ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని గతంలోనే చెప్పానని.. ఇప్పుడు జరుగుతుందని రాష్ట్ర




బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. అశ్వినీ వైష్ణవ్, సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్,అందరూ రూ. 2,245 కోట్ల నిధులతో ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 57 కిలోమీటర్లు మేరకు అమరావతికి ప్రత్యేక రైల్వే లైన్‌ను కేంద్రం మంజూరు చేసిన అంశాన్ని ప్రకటించటం సంతోషంగా వుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహద పడుతుందన్నారు. ఏపీ ఆర్థిక అభివృద్ధితో ముడిపడిన అంశమని.. పర్యావరణ మార్పు వస్తున్న ఈ పరిస్థితుల్లో అడవికి హాని కలగకుండా అంటే 25 లక్షల చెట్లు కాపాడబడ్డాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఏపీ రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదములు తెలుపుతున్నానని పురందేశ్వరి అన్నారు. అమరావతినే రాజధాని అని మొదటి నుంచీ బీజేపీ చెబుతోందని, కేంద్రం కూడా అమరావతి రాజధాని అని మొదటి నుండి ప్రతిపాదిస్తూనే వస్తోందని పురందేశ్వరి అన్నారు. రాజధాని కోసం ప్రత్యేక నిధులు ప్రపంచ బ్యాంకుల నుంచి ఇప్పిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రైల్ లైన్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తున్నారన్నారు. వికసిత్ భారత్ 2047 వరకు సాధించాలనేది బీజేపీ లక్ష్యమని చెప్పారు. వికసిత్ భారత్ కావాలంటే.. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కూడా ముఖ్యమని తెలుసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సింహ భాగం కేంద్రం నిధులు ఇస్తుందన్నారు. అమరావతి రాజధానికి ప్రత్యేక రైల్వే లైన్ మంజూరు చేసిన కేంద్రానికి మరోసారి రాష్ట్ర తరపున, ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానని పురందేశ్వరి అన్నారు.

## చెల్లెలి ఆస్తి దోచుకున్న దుర్మార్గుడు జగన్



అనకాపల్లి జిల్లా, అక్టోబర్ 28: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ హయాంలో లిక్కర్ మాఫియాపై మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు.

కుటుంబంలో చెల్లెలి ఆస్తి దోచుకున్న దుర్మార్గుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తి సీఎంగా పనిచేయడం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు. వైసీపీ హయాంలో పెద్ద ఎత్తున లిక్కర్ మాఫియా జరిగిందని ఆరోపిం చారు. నాణ్యతలేని మద్యాన్ని సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో ఆడుకు న్నారన్నారు. మద్యం తయారీ కంపెనీ నుంచి అమ్మకాలు వరకు అవినీతి చేసి అడ్డంగా దోచుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన లిక్కర్ మాఫియాపై సీఐడీతో విచారణ జరిపిస్తున్నామన్నారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధిలో అనకాపల్లి జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

**మాజీ కోడిగుడ్డు మంత్రిపై చర్యలు తప్పవు..** మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై మంత్రి విరుచుకుపడ్డారు. మాజీ కోడిగుడ్డు మంత్రి చేసిన అక్రమాలను వెలికితీసి, చర్యలు తీసుకుంటామని అన్నారు. సూపర్ సిక్స్ లో దశలవారీగా అన్ని పథకాలు అమలు చేస్తామని.. దీపావళికి గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూటమి నాయకులకు తగిన ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. వైసీపీ వాళ్ళు..రుషికొండకు గుండు కొట్టారని.. భూములు నొక్కేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి అత్యంత ఇష్టమైన జిల్లా.. ఉమ్మడి విశాఖ జిల్లా అని తెలిపారు. అనకాపల్లి జిల్లాకు ఇన్‌చార్జ్ మంత్రిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు సహ అన్ని హామీలను అమలు చేస్తామన్నారు.

రాబోయే 20 సంవత్సరాల పాటు కూటమి అధికారంలో ఉండేలా పరిపాలన ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండే విధంగా ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తామన్నారు. అనకాపల్లిలో వంద పడకల ఎన్టీఆర్ వైద్యాలయాన్ని మల్టీ స్పెషాలిటీఆసుపత్రిగా తీర్చి దిద్దుతామని తెలిపారు. మత్స్యకారులు, బీసీ ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

## కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాల్సిందే: సోమిరెడ్డి




**నెల్లూరు: కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాల్సిందేనని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగన్ హయాంలో ఎత్తేసిన ఈ టెర్మినల్ మూతపడటంతో 10 వేల ఉద్యోగాలు పోయాయన్నారు. కృష్ణపట్నం పోర్టు వద్ద ఆయన నిరసన తెలిపారు.**

**అఖిలపక్ష నేతలతో కలిసి పోర్టు సీఈవోను సోమిరెడ్డి నిలదీశారు. టెర్నినల్‌ను పునరుద్ధరించాలని కోరారు. తొలుత పోర్టులోకి వెళ్లకుండా సోమిరెడ్డిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు.**

# వెస్టర్న్ లుక్స్ తో మెరిసిపోతున్న శ్రీలీల

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల మంచి కమర్షియల్ బ్రేక్ కోసం వెయిట్ చేస్తోంది. డాన్స్, యాక్టింగ్ తో మంచి టాలెంటెడ్ యాక్టర్ గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఖాతాలో ఇప్పటి వరకు 'ధమాకా' రూపంలో ఒకే ఒక్క హిట్ ఉంది. సూపర్ స్టార్ మహేష్ బాబుకి జోడీగా 'గుంటూరు కారం' సినిమాలో శ్రీలీల నటించింది. ఆ మూవీ ఫ్లాప్ కావడంతో శ్రీలీలకి ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. ఆమె నితిన్ కి జోడీగా 'రాబిన్ హుడ్' మూవీలో నటించింది. ఈ సినిమా రిలీజ్ కి సిద్ధం అవుతోంది. డిసెంబర్ లో 'రాబిన్ హుడ్' మూవీ థియేటర్స్ లోకి వచ్చే అవకాశం ఉంది. అలాగే రవితేజతో మరోసారి శ్రీలీల జతకట్టింది. ఈ సినిమా ప్రొడక్షన్ దశలో ఉంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' లో పవన్ కళ్యాణ్ కి జోడీగా శ్రీలీల నటిస్తోంది.




ఈ మూవీ కూడా ప్రొడక్షన్ దశలోనే ఉంది. తమిళంలో కూడా ఓ సినిమాలో హీరోయిన్ గా కన్ఫర్మ్ అయ్యిందనే ప్రచారం నడుస్తోంది. ఇలా శ్రీలీల చేతిలో సినిమాలు ఉన్న కూడా ఆమె సక్సెస్ రేట్ తక్కువగా ఉండటంతో పెద్దగా ఎవరి ఫోకస్ లేదు. అయితే శ్రీలీలలో మంచి కమర్షియల్ హీరోయిన్ అని ఒక మంచి బ్రాండ్ ఇమేజ్ దక్కింది. ఆమె డాన్స్ టాలెంట్ కి మహేష్ బాబు ఫిదా అయిపోయాడు. ఇదిలా ఉంటే ఈ అమ్మడు సోషల్ మీడియాలో యాక్టివ్ గానే ఉంటుంది. రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో తన అప్డేట్స్ షేర్ చేస్తూ ఉంటుంది. అలాగే అప్పుడప్పుడు గ్లామరస్ పిక్స్ కూడా పంచుకుంటుంది. శ్రీలీలకి ఇన్ స్టాగ్రామ్ లో 6.2 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు.

అందుకే ఒక్క ఫోటో పెడితే లక్షల్లో లైక్స్ వస్తూ ఉంటాయి. తాజాగా ఈ అమ్మడు బ్లాక్ కలర్ స్కర్టులో ఉన్న గ్లామరస్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలలో శ్రీలీల స్టన్నింగ్ లుక్స్ తో మెరిసిపోతోంది. వెస్ట్రన్ స్టైల్ అవుట్ ఫిట్ లో అదిరిలోయ్ ఫోజులుతో ఆకట్టుకుంటోంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. శ్రీలీల కళ్ళు చూసి ఎవరైనా ఫ్లాట్ అయిపోతారని ఆమె ఫ్యాన్స్ ఫోటోలపై కామెంట్స్ చేస్తున్నారు.

## లక్కీ మీనాక్షి.. ఇంతగా గ్లామర్ డోస్ పెంచితే ఎలా?

టాలీవుడ్ లో ప్రస్తుతం సెన్సేషన్ బ్యూటీ మీనాక్షి చౌదరి తన లేటెస్ట్ ఫోటో షూట్ తో ఫ్యాన్స్ ను ఎంతగానో ఆకట్టుకుంటోంది. తన గ్లామర్ తో ఎప్పుడూ వార్తల్లో నిలిచే ఈ బ్యూటీ, గ్లామరస్ డ్రెస్ లో స్టైలిష్ లుక్ తో స్టన్ అయ్యేలా స్టిల్ ఇచ్చింది. లక్కీ భాస్కర్ ప్రమోషన్స్ లో భాగంగా అమ్మడు ఈ విధంగా దర్శనమిచ్చింది. ఈ ఫోటోలలో మీనాక్షి చౌదరి అద్దం ముందు తన స్టైల్ లో నిలబడి, అద్భుతమైన ఫొటోషూట్ కోసం ఫోజులు ఇస్తోంది. సింపుల్ మరియు ఎలిగెంట్ లుక్ లో కనిపిస్తున్న మీనాక్షి, గ్లామరడ్ దుస్తులలో మరింత ఘాటుగా కనిపిస్తూ అభిమానులను అలరిస్తోంది. ఆమె పొడవాటి జుట్టు, ఆకర్షణీయమైన చిరునవ్వు తో ప్రతి ఫోటోలో ఒక ప్రత్యేకమైన ఆకర్షణను తీసుకొస్తున్నాయి. ఈ ఫోటోలకు సంబంధించిన ప్రదేశం దుబాయ్ అని మీనాక్షి తన ఇన్‌స్టాగ్రామ్ లో పేర్కొంది. దుబాయ్ లో



తన అనుభవం ఎంతో మధురంగా ఉన్నట్టు కామెంట్ చేసింది. ఈ ఫోటోలలో ఆమెతో పాటు హీరో దుల్కర్ సల్మాన్ కూడా కనిపిస్తున్నారు. ఈ ఫోటోలకు సూపర్ రిస్పాన్స్ రావడంతో పాటు, అభిమానులు మీనాక్షి స్టైలింగ్, గ్లామర్ పైన తమ అభిప్రాయాలను కామెంట్స్ రూపంలో వ్యక్తం చేస్తున్నారు. మీనాక్షి చౌదరి, మాలీవుడ్ స్టార్ హీరో లక్కీ భాస్కర్ సరసన ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న ఈ సినిమా విడుదల కానుంది. ఈ మూవీలో మీనాక్షి పాత్రకు మంచి స్కోప్ ఉందని, ఆ పాత్ర ద్వారా తన గ్లామర్ తో పాటు నటనా ప్రతిభను కూడా చూపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ద్వారా ఫ్యాన్స్ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఇలాంటి గ్లామరస్ మరియు స్టైలిష్ లుక్స్ తో మీనాక్షి చౌదరి ప్రతి ఫోటోలో తన ప్రత్యేకతను చూపిస్తోంది. టాలీవుడ్ లో స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకుంటున్న ఈ అందాల భామకి లక్కీ భాస్కర్ చిత్రం బిగ్ సక్సెస్ ను అందిస్తుందో లేదో చూడాలి.





# సారంగపాణి సాంగ్.. యమా స్టైలిష్ గా ప్రియదర్శి, రూప!




ప్రియదర్శి, రూప కొడువయూర్ హీరోహీరోయిన్లుగా సారంగపాణి మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను శ్రీదేవి మూవీస్ బ్యానర్ పై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే తన బ్యానర్ పై శివలెంక కృష్ణ ప్రసాద్ ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అందించగా, ఇప్పుడు సారంగపాణిని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. జెంటిల్ మ్యాన్, సమ్మోహనం మూవీస్ తర్వాత మరోసారి మోహనకృష్ణతో చేతులు కలిపారు. ఇప్పటికే సారంగపాణి షూటింగ్ పూర్తి కాగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుతున్నారు మేకర్స్. ఇదివరకే అనౌన్స్ చేసినట్లు డిసెంబర్ 20వ తేదీన మూవీ రిలీజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకుగాను అప్పుడే ఏర్పాట్లు మొదలుపెట్టేశారు. తాజాగా మ్యూజిక్ ప్రమోషన్స్ ను స్టార్ట్ చేశారు. రీసెంట్ గా ఫస్ట్ సాంగ్ ను రిలీజ్ చేయగా.. సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. సారంగో సారంగా.. అమ్మాయి అవునంది ఏకంగా అంటూ సాగుతున్న ఆ పాట భారీ వ్యూస్ అందుకుంటోంది. 'ఉల్లా ఉల్లా ఉల్లా ఉల్లాస కల్లోలం.. గల్లా గల్లా గంతులాడింది భూగోళం.. నీ సంబరం నీలాంబరం.. మేఘాల అంచుల్లో నుంచో బెట్టిందే మెళ్ళోన దండేసి ఛత్రం పట్టిందే అంటూ సాగుతున్న ఆ పాటకు సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి అందించిన లిరిక్స్ ఆకట్టుకుంటున్నాయి. వివేక్ సాగర్ సమకూర్చిన మ్యూజిక్ అదిరిపోయింది. అర్మాన్ మాలిక్ ఎనర్జిటిక్ గా పాడి అందిరినీ అట్రాక్ట్ చేస్తున్నారు. డ్యాన్స్ మాస్టర్ దినేష్ కొరియోగ్రఫీ కూడా బాగుందనే చెప్పాలి. సాంగ్ లో ప్రియదర్శి, రూప యమా స్టైలిష్ లుక్‌లో కనిపించి ఇంప్రెస్ చేశారు. లిరికల్ సాంగ్ మధ్యలో షూటింగ్ బిట్స్ ను కూడా యాడ్ చేశారు మేకర్స్. ఓవరాల్ గా సారంగపాణి ఫస్ట్ సాంగ్.. ఇప్పుడు నెట్టింట ఫుల్ ట్రెండ్ అవుతోంది. అయితే కామెడీ జోనర్ లో రూపొందుతున్న సారంగపాణి మ్యూజిక్ రైట్స్ ను ఇప్పటికే ప్రముఖ సంస్థ ఆదిత్య మ్యూజిక్ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఆ డీల్.. సాలిడ్ నంబర్స్ లో జరిగినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఇక సినిమా విషయానికొస్తే.. వెన్నెల కిషోర్, వీకే నరేష్, వైవా హర్ష ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. తనికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల, శివన్నారాయణ ఇతర పాత్రల్లో సందడి చేయనున్నారు. పీజీ విందా, రవీందర్ సినిమాటోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్ విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా చివరి దశలో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో ఫుల్ లెంగ్త్ ప్రమోషన్స్ ను మేకర్స్ స్టార్ట్ చేయనున్నారట. మరి సారంగపాణి మూవీ ఎలాంటి హిట్ గా నిలుస్తుందో వేచి చూడాలి.

# గేమ్ ఛేంజర్.. ఇదే కంటిన్యూ అయితే ఇబ్బందే!




టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్, కోలీవుడ్ డైరెక్టర్ శంకర్ కాంబోలో గేమ్ ఛేంజర్ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఆ సినిమా వర్క్స్.. ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి మూవీని రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ రీసెంట్ గా అనౌన్స్ చేశారు. జనవరి 10వ తేదీన విడుదల చేయనున్నట్లు తెలిపారు. దీంతో సినిమా కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు గేమ్ ఛేంజర్ మూవీ నుంచి పోస్టర్స్ తో పాటు రెండు సాంగ్స్ ను మాత్రమే మేకర్స్ రిలీజ్ చేశారు. ఇప్పుడు టీజర్ కోసం మెగా ఫ్యాన్స్ అంతా వెయిట్ చేస్తున్నారు. దసరా కానుకగా టీజర్ ను రిలీజ్ చేస్తారని అంతా అనుకున్నారు. ఇప్పుడు దీపావళి కానుకగా రిలీజ్ చేయనున్నారని కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. టీజర్ కట్ ను ఇప్పటికే మేకర్స్ దాదాపు ఫినిష్ చేశారని, ఎవరూ ఊహించని రేంజ్ లో ప్లాన్ చేశారని టాక్ వినిపిస్తోంది. టీజర్ లో మరో కొత్త సాంగ్ ను యాడ్ చేశారని, పవర్ ఫుల్ డైలాగ్స్ ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. చరణ్ మరో గెటప్ రివీల్ చేస్తారని గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. టీజర్ రిలీజ్ డేట్ పై వీకెండ్ లోనే అధికారిక ప్రకటన రాబోతోందని టాక్ వచ్చింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అనౌన్స్మెంట్ రాలేదు. దీంతో ఇప్పుడు ఫ్యాన్స్ సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెడుతున్నారు. టీజర్ అప్డేట్ కోసం అడుగుతున్నారు. అదే సమయంలో గేమ్ ఛేంజర్ మేకర్స్ పట్ల పలువురు అభిమానులు సోషల్ మీడియాలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాన్స్ ఫీలింగ్స్ ను పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇదే కంటిన్యూ అయితే.. మూవీకి ఉన్న ఆదరణపై ఎఫెక్ట్ పడుతుందని చెబుతున్నారు. అసలు మేకర్స్ ప్లాన్ ఏంటో చెప్పండని అంటున్నారు. టీజర్ కు సంబంధించిన అప్డేట్ ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. గేమ్ ఛేంజర్ ను భారీ బడ్జెట్ తో స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ కియారా, టాలీవుడ్ అందం అంజలి.. ఫిమేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. శ్రీకాంత్, ఎస్ జే సూర్య, నవీన్ చంద్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ ఎస్ తమన్.. మ్యూజిక్ అండ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ను అందిస్తున్నారు. మరి గేమ్ ఛేంజర్ టీజర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందో వేచి చూడాలి.

# చీరలో మెరిసిపోతున్న అందాల మీనాక్షి


మీనాక్షి చౌదరి తన తాజా ఫోటోషూట్ లో అందరిని ఆకట్టుకునేలా కనిపించారు. ఆమె ధరించిన తెల్ల చీరలో చూడచక్కని అందంతో మెరిసిపోతున్నారు. ఈ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, "Feeling Haseen" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. టాలీవుడ్ లో తన గ్లామర్ మరియు స్టైలిష్ లుక్స్ తో మెప్పిస్తున్న ఈ బ్యూటీ, తన ట్రెడిషనల్ లుక్ లో కూడా అంతే ఆకర్షణీయంగా ఉంటుందని మరోసారి రుజువు చేశారు. మీనాక్షి చౌదరి కెరీర్ విషయానికి వస్తే, ఆమె ఇటీవలే పలు చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అక్కినేని సుశాంత్ సరసన 'ఇచ్చట వాహనములు నిలపరాదు' చిత్రం ద్వారా తెరపై అడుగుపెట్టిన ఈ అందాల రాశి, ఆ తరువాత రవితేజతో 'ఖిలాడి' లో నటించి తన గ్లామర్ షోతో అందరినీ మెప్పించారు. కానీ, ఆ సినిమా ఆశించినంత హిట్ అవ్వకపోయినా, మీనాక్షికి ప్రేక్షకులలో మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆమె నటించిన 'హిట్ 2' చిత్రం మంచి విజయాన్ని సాధించడంతో




ఆమెకు మంచి అవకాశాలు వచ్చాయి. గ్లామర్ పాత్రల్లోనే కాకుండా నటనకు కూడా స్కోప్ ఉన్న పాత్రల్లో ఆమె మెరవడం ఆమెకు మరింత మంచి పేరును తీసుకొచ్చింది. మహేష్ బాబు 'గుంటూరు కారం', విజయ్ 'ది గోట్' వంటి చిత్రాల్లో నటించింది. ఇక ఆమె రీసెంట్ గా నటించిన 'లక్కీ భాస్కర్' చిత్రంలో కూడా నటిస్తున్నారు. దీపావళి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రం, ఆమెకు మంచి హిట్ అందించే అవకాశం కల్పిస్తుందని అందరూ భావిస్తున్నారు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్‌తో 'మెకానిక్ రాకీ' లోనూ, మెగా హీరో వరుణ్ తేజ్ సరసన 'మట్కా' చిత్రంలోనూ నటిస్తున్నారు. వీటితో పాటు, విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో రూపొందుతున్న మరో చిత్రంలోనూ మీనాక్షి నటిస్తున్నారు. మీనాక్షి చౌదరి ఇంత వరకూ తాను చేసిన సినిమాల్లో నటనతో మాత్రమే కాకుండా తన గ్లామర్, స్టైల్, ప్రత్యేకతతో ప్రేక్షకుల మనసులను దోచుకున్నారు. ప్రస్తుతం ఆమె తన కెరీర్ లో మంచి స్థాయికి చేరుకోవాలని, వరుసగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

## అషురెడ్డి.. లెగ్స్ అందాలతో మైండ్ బ్లాక్ స్టిల్

అషు రెడ్డి.. ఈ పేరు గురించి సోషల్ మీడియా జనాలకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అమ్మడు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ సెలబ్రిటీ. మొదటగా డబ్ స్మాష్ వీడియోలతో తన యాంకరింగ్ మరియు యాక్టింగ్ స్కిల్స్ చూపుతూ యూత్ కి దగ్గరైంది. ఈ వీడియోల ద్వారా విశేషమైన ఫాలోయింగ్ సంపాదించుకుని, టాలీవుడ్ లో 'చల్ మోహనరంగా' చిత్రంలో అవకాశం అందుకుంది. ఈ సినిమాలో అషు తన సహజమైన నటనతో ఆకట్టుకుంది. అంతటితో ఆగిపోకుండా, అషు తన కెరీర్ లో బిగ్ బ్రేక్ పొందిన షో బిగ్ బాస్ సీజన్ 3 లో పాల్గొంది. ఈ షోలో ఆమె



తన సపోర్టివ్ మరియు అట్రాక్టివ్ ఆటతీరు ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువైంది. ఈ షో ద్వారా అషు పేరు మరింతగా ప్రజల్లోకి వ్యాపించింది. తర్వాత బిగ్ బాస్ నాన్ స్టాప్ ఫస్ట్ సీజన్ లో కూడా పాల్గొని, మరోసారి తన ప్రత్యేకతను ప్రదర్శించింది. సినిమాలు మరియు బిగ్ బాస్ షో ద్వారా వచ్చిన ఫేమ్ ని అషు అందంగా హైలెట్ సీబీసుకుంది. ఇక, సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మతో ఇంటర్వ్యూస్ ద్వారా పాపులారిటీని మరింత పెంచుకుంది. వర్మతో కలిసినప్పుడు ఆమె ధైర్యంగా తన అభిప్రాయాలను వ్యక్తపరచడం, ప్రేక్షకులకు ఆసక్తిని కలిగించింది. ఈ ఇంటర్వ్యూస్ ద్వారా ఆమె న్యూస్ లో నిలిచింది. ఇప్పటివరకు అషు ఎన్నో చిత్రాలలో చిన్న పాత్రలు చేసినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె తన అందంతో అభిమానులను మంత్ర ముగ్ధుల్ని చేస్తోంది. తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో అషు తన స్టైలిష్ అవుట్ ఫిట్ లో గ్లామర్ ఫోటోలను షేర్ చేయగా, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. అషు అందం, అభినయం మరియు ఆమె స్టైలింగ్ పట్ల నెటిజన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. నీలం రంగు డ్రెస్ లో అషు పిక్స్ తీసుకుని తన ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. లెగ్స్ అందాలతో యూత్ ని అట్రాక్ట్ చేస్తూ, తన మోడర్న్ లుక్స్ తో అందరిని ఆకట్టుకుంటోంది. మరి ఈ గ్లామరస్ ఫోటోల ద్వారా అమ్మడు ఏమైనా కొత్తగా సినిమా అవకాశాలు అందుకుంటుందో లేదో చూడాలి.



# చిన్న సంస్థను తొక్కేసిన ఫలితం..

సెర్చింజన్ దిగ్గజం గూగుల్ భారీ ఫైన్ చెల్లించాల్సి వస్తోంది. ఓ చిన్న వెబ్‌సైట్‌ను తన స్వార్థం కోసం తొక్కేసినట్లు అది ఆరోపణలు ఎదుర్కొంటోంది. యూకేకు చెందిన షివన్, ఆడమ్ రిఫ్ అనే జంట 2006లో ధరలను పోల్చే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దీనికి 'ఫౌండెమ్' అని పేరు పెట్టారు. వీరు ఆ వెబ్‌సైట్‌ను లైవ్‌లోకి తెచ్చాక.. గూగుల్ సెర్చ్‌లో నాటకీయంగా దాని విజిబులిటీ పడిపోవడం మొదలైంది. జనం 'ప్రైస్ కంపారిజన్', 'షాపింగ్' వంటి కీవర్డ్స్ వాడినా ఈ వెబ్‌సైట్ కనిపించడం లేదు. గూగుల్‌కు చెందిన ఆటోమేటెడ్ స్పామ్ ఫిల్టర్స్ విధించిన పెనాల్టీ కారణంగా తమ వెబ్‌సైట్ పడిపోతోందని షివన్, ఆడమ్ రిఫ్ గుర్తించారు. దీనికితోడు గూగుల్‌లో దాని ర్యాంక్ కూడా గణనీయంగా పడిపోయింది. ఇతర సెర్చ్ ఇంజిన్లలో సాధారణంగానే ఉన్నట్లు గమనించారు. ఫలితంగా 'ఫౌండెమ్' ఆదాయం కూడా పడిపోయింది. సాంకేతిక కారణాల వల్లే తమ పేజీ సెర్చ్‌లో కనిపించలేదని గుర్తించి.. గూగుల్ ఈవిషయాన్ని ప్రస్తావించారు. దాదాపు రెండేళ్లైనా అది పెనాల్టీని తొలగించలేదు. దీంతో ఆ జంట చేసేది లేక ఐరోపా కమిషన్‌ను ఆశ్రయించింది. అధికారులు సుదీర్ఘకాలంపాటు దర్యాప్తు చేసి.. గూగుల్ తన షాపింగ్ సర్వీస్‌ను ప్రమోట్ చేసుకోవడానికి.. 'ఫౌండెమ్' వంటి సంస్థలతో అన్యాయంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. మార్కెట్ ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేసిందని 2017లో తీర్పును వెలువరించింది. 2.4 బిలియన్ పౌండ్ల (సుమారు రూ.26 వేల కోట్లు) ఫైన్‌ను వేసింది. దీనిపై ఆ సెర్చింజన్ అప్పీల్‌కు వెళ్లింది. దాదాపు ఏడేళ్లపాటు న్యాయపోరాటం జరిగింది. చివరికి 'ది యూరోపియన్ కోర్ట్ ఆఫ్ జస్టిస్' కింది న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పును సమర్థించింది. గూగుల్ అప్పీల్‌ను తిరస్కరించింది. దీనిపై షివన్, ఆడమ్ రిఫ్ జంట స్పందిస్తూ తీర్పు చాలా ఆలస్యమైందని అభిప్రాయపడింది. వీరి ఫౌండెమ్‌ను 2016లో మూసివేయాల్సి వచ్చినా.. సివిల్ డామేజ్ క్లెయిమ్‌లపై కేసు 2026లో విచారణకు రానున్నట్లు తెలిపారు. ఇక గూగుల్ ప్రతినిధి బీబీసీతో మాట్లాడుతూ ఐరోపా కమిషన్‌కు నిర్ణయాలకు అనుగుణంగా తాము 2017లో చేసిన మార్పులను కొనసాగిస్తున్నామన్నారు. దాదాపు 800 షాపింగ్ కంపారిజన్ సర్వీసులకు కోట్ల కొద్దీ క్లిక్‌లు వచ్చాయని తెలిపారు.



# కాళేశ్వరం డీపీఆర్‌ను కేసీఆర్ ఆమోదించారు: మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు

హైదరాబాద్: విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై విచారణ సాగింది. కాళేశ్వరం డీపీఆర్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించినట్లు విచారణ సందర్భంగా వెంకటేశ్వర్లు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన దస్త్రాలను కమిషన్‌కు అందించారు. కాళేశ్వరం డిజైన్లను ఫైనల్ చేయమని కేసీఆర్ చెప్పినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మినిట్స్‌కు సంబంధించిన దస్త్రాలు, మూడు బ్యారేజీల వివరాలను సమర్పించారు. మేడిగడ్డ కుంగుబాటుకు నిర్వహణ లోపమే కారణమా? మూడు బ్యారేజీల్లో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి అప్పటి ప్రభుత్వాధినేత ఆదేశించారని వెంకటేశ్వర్లు బదులిచ్చినట్లు సమాచారం.

# తెలంగాణను ఆయిల్ పామ్ హబ్‌గా మారుస్తాం



భద్రాద్రి కొత్తగూడెం: మలేషియా పర్యటనపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. మలేషియాలో ఆయిల్ పామ్ సాగు సాంకేతిక పద్ధతులు ప్రాసెసింగ్ ప్లాంట్స్...రిఫైనరీ ప్లాంట్స్ పరిశీలించినట్లు వివరించారు. మలేషియా ఆయిల్ పామ్, వ్యవసాయ శాఖ మంత్రులను కలిశామని అన్నారు. ఇవాళ జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ....తెలంగాణ మలేషియా మధ్య వ్యాపార వాణిజ్య అవకాశాలపై చర్చించినట్లు తెలిపారు.

**ఆయిల్ పామ్ సాగుకు 31 జిల్లాల్లో అనుమతులు ...** తెలంగాణలో ఆయిల్ పామ్ సాగుకు 31 జిల్లాల్లో అనుమతులు ఉన్నాయని తెలిపారు. ఆయిల్ ఫెడ్‌తో పాటు 14 ప్రైవేట్ కంపెనీలకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. తక్కువ ఎత్తు కురచ ఆకు ఎక్కువ దిగుబడులు ఇచ్చే ఆయిల్ పామ్ మొక్కల రకాల కోసం మలేషియాలో వెతికామని అన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా కోకో, వక్క, జాజికాయ, మిరియం సాగు చేయొచ్చని తెలిపారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలకు సబ్సిడీ ఇస్తామని అన్నారు. భారతదేశం ప్రతి ఏడాది లక్ష కోట్లు పైగా విలువైన వంట నూనెలు దిగుమతి చేసుకుంటుందని తెలిపారు.

దేశవ్యాప్తంగా 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తే దిగుమతులు అవసరం లేదని అన్నారు. మలేషియాలో ఆయిల్ పామ్ సాగులో తెలుసుకున్న అంశాలు ఇక్కడ రైతులకు వివరిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

**దిగుమతి సుంకం పెంపుతో...** మరోవైపు.. దిగుమతి సుంకం పెంపుతో పామాయిల్ పండించే రైతులకు లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.14,392గా ఉండగా.. అది టన్నుకు రూ.1,500 నుంచి రూ.1,700 వరకు అదనంగా పెరిగే అవకాశం ఉందని, వెరసి మొత్తంగా ఒక్కో ఆయిల్ పామ్ గెల ధర రూ.16,500గా పెరిగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు.

**పామాయిల్ సాగు విరివిగా చేపట్టాలి..** తెలంగాణలో ప్రస్తుతం 44,400 ఎకరాల పామ్ ఆయిల్ తోటల నుంచి 2.80 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ గెలలు దిగుబడి వస్తుందని తుమ్మల తెలిపారు. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో తెలంగాణలో పామాయిల్ సాగును పెద్ద ఎత్తున చేపట్టడానికి అవకాశాలు మరింత మెరుగుపడ్డాయని వివరించారు. రైతులు పామాయిల్ సాగు విరివిగా చేపట్టాలని తుమ్మల పిలుపునిచ్చారు. కాగా ముడి పామాయిల్ దిగుమతిపై సుంకం ఎత్తివేయడంతో ఆయిల్ పామ్ గెలల ధర తగ్గడంతో రైతుల్లో నిరాశ నెలకొందని, ఈ పంట సాగు చేయాలనుకున్నవారిపై ప్రతికూల ప్రభావం చూపిందని అన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు అధిక ధరలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, దిగుమతి చేసుకుంటున్న ముడి పామాయిల్‌పై సుంకాన్ని పెంచాలని ఆ లేఖలో కోరారు. అదేవిధంగా ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోనూ తుమ్మల ప్రత్యేకంగా మాట్లాడారు. స్పందించిన కేంద్రం తాజాగా సుంకాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.



# మా పేర్లు ఎందుకో రావడం లేదు.. షబ్బీర్ అలీ

హైదరాబాద్: జన్వాడ ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీ తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపింది. ఫామ్ హౌస్‌లో రేవ్ పార్టీ జరిగిందని కాంగ్రెస్, లేదు పార్టీ జరిగిందని బీఆర్ఎస్ నేతల మధ్య డైలాగ్ వార్ జరుగుతోంది.

కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల పార్టీ ఇచ్చారని.. పార్టీలో డ్రగ్స్ వాడారని పోలీసులు స్పష్టం చేశారు. ఫామ్ హౌస్ నుంచి రాజ్ పాకాల వెళ్లగా, అతని సహచరుడు విజయ్ మద్దూరు పోలీసులకు చిక్కారు. అతనికి వైద్య పరీక్షలు చేయగా కొకైన్ డ్రగ్స్ తీసకున్నారని తేలింది. దీంతో జన్వాడ ఫామ్ హౌస్‌లో ఏం జరుగుతోంది.. విచ్చలవిడిగా డ్రగ్స్ వాడుతున్నారా అని అధికార కాంగ్రెస్ మండిపడింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పించింది.

**తప్పుపట్టిన షబ్బీర్ అలీ :** కేటీఆర్ తీరును ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ తప్పు పట్టారు. 'కేటీఆర్‌కు సిగ్గు శరం ఉందా? కేటీఆర్‌కు డ్రగ్స్‌తో సంబంధం ఉన్నట్టు ఉంది. అందుకే డ్రగ్స్ అంశం రాగానే కేటీఆర్ పేరు వస్తోంది. డ్రగ్స్ విషయంలో మా పేర్లు ఎందుకు రావడం లేదు. కేటీఆర్ పేరే ఎందుకు వస్తోంది.

కేటీఆర్ ఇప్పటికైనా నార్కో టెస్ట్‌కి వస్తే నిజం తెలుతుంది కదా. జన్వాడ ఫాం హౌజ్ విచిత్రమైంది. పార్టీ జరిగిన దగ్గర ఒక వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నాడని తెలినా కేటీఆర్ బుకాయిస్తున్నాడు. కేసీఆర్ కుటుంబ ఆస్తులు ఎలా పెరిగాయో విచారణ జరపాలి. తెలంగాణ పేరుతో ఎంత లూటీ చేశారో ప్రజలకు తెలియాలి. చట్టం తెలియని వాళ్లు తప్పు చేస్తే ఏమో అనుకోవచ్చు కానీ అన్ని తెలిసిన వాళ్లు ఎలా తప్పు చేస్తారు అని' షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**నోటీసులు.. టైమ్ కావాలి :** మరోవైపు కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు.

పీఎస్ వచ్చేందుకు రెండు రోజుల సమయం కావాలని న్యాయవాదులు పోలీసులను కోరారు. మరోవైపు అరెస్ట్ చేయొద్దని హైకోర్టులో రాజ్ పాకాలా పిటిషన్ కూడా దాఖలు చేశారు.

# కేసీఆర్ సూచించిన వారికి పీఏసీ చైర్మన్ ఇవ్వాలి



హైదరాబాద్, అక్టోబర్ 28: పబ్లిక్ అకౌంట్స్ కమిటీ మీటింగ్‌ను బీఆర్ఎస్ బాయ్ కాట్ చేసింది. అసెంబ్లీ సంప్రదాయాలకు విరుద్ధంగా పీఏసీ చైర్మన్‌ను నియమించారని బీఆర్ఎస్ ఆరోపించింది. పీఏసీ సమావేశంలో బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎల్.రమణ నిరసన తెలిపారు. అనంతరం తెలంగాణ భవన్‌లో గులాబీ నేతలు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఎవరిని సూచిస్తే వారిని పీఏసీ చైర్మన్‌గా కేసీఆర్ నియమించారని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. క్రిష్ణారెడ్డి, గీతారెడ్డిని పీఏసీ చైర్మన్లుగా చేశామన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ సూచించిన కే సీ.వేణుగోపాల్ పీఏసీ చైర్మన్ అయ్యారని తెలిపారు. అయితే కేసీఆర్ సూచించిన హరీష్ రావు నామినేషన్‌ను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు.

ఇప్పటికైనా ప్రతిపక్ష నేత కేసీఆర్ సూచించిన హరీష్ రావును పీఏసీ చైర్మన్‌ను చేయాలని డిమాండ్ చేశారు. అరికేపూడి గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని మంత్రి శ్రీధర్ బాబు అంటున్నారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అధిష్ఠానానికి లేఖ రాశారన్నారు. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలతో పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలని ఏఐసీసీ చెప్పిందని మహేష్ కుమార్ గౌడ్ అంటున్నారన్నారు. ఆస్తులు కాపాడుకునేందుకు ఎమ్మెల్యేలు పార్టీ మారారని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ చెప్పారన్నారు. పీఏసీ చైర్మన్ విషయంలో ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోవాలన్నారు. కేసీఆర్ సూచించిన వారిని పీఏసీ చైర్మన్‌గా నియమించాలని వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

**అసెంబ్లీ సంప్రదాయాలకు తూట్లు: సత్యవతి రాథోడ్...** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బుల్డోజర్ పాలిటిక్స్ చేస్తోందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. అరికెపూడి గాంధీని పీఏసీ చైర్మన్‌గా అక్రమంగా నియమించారన్నారు. పీఏసీ చైర్మన్‌గా ఎవరు ఉండాలో నిర్ణయం తీసుకునే అధికారం కేసీఆర్‌కు ఉందని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు చెప్పినా చర్యలు తీసుకోలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి మండలి చీఫ్ విప్ ఇచ్చారని.. అరికెపూడి గాంధీ, పట్నం మహేందర్ రెడ్డిని అడ్డం పెట్టుకుని రేవంత్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాంప్రదాయాలకు ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలే అంటున్నారని మాజీ మంత్రి తెలిపారు.

**ఆయనకు ఎలా ఇస్తారు: ఎల్. రమణ...** ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని ఎమ్మెల్సీ ఎల్.రమణ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలో పీఏసీ చైర్మన్ పదవి కీలకంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం చేసిన ఖర్చులపై పీఏసీలో చర్చ జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ ఇచ్చారని.. కాంగ్రెస్ కండువా కప్పుకున్న అరికెపూడి గాంధీకి ఎట్లా పీఏసీ చైర్మన్ పదవి ఇస్తారని ఎమ్మెల్సీ రమణ ప్రశ్నించారు.

# పోలీసుల నోటీసులపై రాజ్‌పాకాల స్పందన



హైదరాబాద్, అక్టోబర్ 28: జన్వాడ ఫామ్‌హౌస్ ఘటనకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు మోకిలా పోలీసులు (%ూశీశ్రీఱవ%)నోటీసులు ఇచ్చారు. మోకిలా పోలీసులు ఇచ్చిన నోటీసులపై ఎట్టకేలకు కేటీఆర్ బావమరిది స్పందించారు. మోకిలా పోలీస్ స్టేషన్‌కు రాజ్ పాకాల న్యాయవాదులు చేరుకున్నారు. విచారణకు వచ్చేందుకు రెండు రోజుల సమయం కావాలని పాకాల న్యాయవాదులు పోలీసులను కోరారు. కాగా.. విచారణకు హాజరుకావాలంటూ కేటీఆర్ బావమరిదికి పోలీసులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. బిఎన్ఎస్ఎస్ 35(3) సెక్షన్ ప్రకారం నోటీసులు జారీ చేశారు. రేవ్ పార్టీ కేసుకు సంబంధించి విచారించాల్సి ఉందని పోలీసులు ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) తమ ముందు హాజరు కావాలన్నారు. అడ్రస్ ప్రూఫ్‌లతో పాటు, కేసుకు సంబంధించిన ఆధారాలు సమర్పించాలని కోరారు. విచారణకు హాజరుకాకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈరోజు మోకిలా పీఎస్‌కు హాజరు కాకుంటే బిఎన్ఎస్ఎస్ 35 (3),(4),(5),(6) సెక్షన్ల ప్రకారం అరెస్టుకు దారి తీస్తుందని పేర్కొంటూ రాజ్ పాకాలకు మోకిలా ఇన్స్‌పెక్టర్ నోటీసులు జారీచేశారు. అయితే రాజ్ పాకాల అందుబాటులో లేకపోవడంతో ఆయన ఉంటున్న విల్లాకు నోటీసులను అంటించారు పోలీసులు. మరోవైపు ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే రాజ్ పాకాల హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో రాజ్ పాకాల లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. పోలీసులు తనని అక్రమంగా అరెస్టు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారన్న సమాచారం నేపథ్యంలో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు వీలుగా ముందుస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో రాజ్ పాకాల పిటిషన్ వేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. జన్వాడలోని రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌పై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విదేశీ మద్యంతో పాటు క్యాసినో ఆట వస్తువులను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో అనుమతి లేకుండా వినియోగిస్తున్న విదేశీ మద్యం 7.6 లీటర్లు, ఐఎంఎఫ్ఎల్ మద్యం 8.1 లీటర్లు, బీర్లు 6 లీటర్లను స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో 22 మంది పురుషులు, 16 మంది మహిళలు పాల్గొన్నారు. వీరందరికీ అక్కడే డ్రగ్ టెస్టులు చేసేందుకు ప్రయత్నించగా మహిళలు నిరాకరించారు. అయితే పురుషులందరికీ డ్రగ్ టెస్టులు నిర్వహించగా విజయ్ మద్దూరికి పాజిటివ్ వచ్చింది. అయితే నిన్న పార్టీలో హాజరైన మహిళలు.. మోకిలా పోలీస్ స్టేషన్‌కు వస్తున్నారు.

ఫాంహౌస్‌లో దాడి సందర్భంగా పలువురి సెల్‌ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. దీంతో సీజ్ చేసిన తమ ఫోన్స్ ఇవ్వాలని పోలీస్ స్టేషన్‌కు మహిళలు వస్తున్నారు. "మా వ్యక్తిగత సమాచారం ఇచ్చామని.. మా ఫోన్స్ ఇవ్వాలి" అని పోలీసులను మహిళలు కోరుతున్నారు.

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందుకు యత్నిస్తే ఊరుకోం: మంత్రి పొన్నం



హైదరాబాద్: రాజకీయంగా ఎవరి మీదా కేసు పెట్టాలని ప్రభుత్వం చూడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్వాడ ఫామ్‌హౌస్ పార్టీ వ్యవహారంలో అర్ధరాత్రి డీజే సౌండ్ పెట్టి చుట్టుపక్కల వాళ్లకు ఇబ్బంది కలిగించారని చెప్పారు. ప్రభుత్వానికి ఎవరి మీదా కక్ష సాధింపు చర్యలు లేవని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందు యత్నిస్తే ఊరుకోమని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# కేజీబీవీ బాలికలకు మెరుగైన వైద్యం అందిస్తాం : మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి : కేజీబీవీలో అస్వస్థతకు గురైన బాలికలు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని మంత్రి డి.శ్రీధర్ బాబు తెలిపారు. పెద్దపల్లి జిల్లా దవాఖానలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ముత్తారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వార్డెన్ సమాచారం అందించడంతో వెంటనే జిల్లా హాస్పిటల్‌కు 53 మంది బాలికలను తరలించి చికిత్స అందించాన్నారు. బాలికలు ఒకే సారి అస్వస్థతకు గురి కావడానికి గల కారణాలను విచారిస్తున్నామని, అక్కడ సమీపంలో గల డంప్ యార్డ్‌ను తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. 53 మంది బాలికలు క్షేమంగా ఉన్నారని ఎవరు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని



పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలలో కూడా పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని, భవిష్యత్తులో బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

# టాటా-ఎయిర్‌బస్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

వడోదరా: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఇద్దరూ కలిసి సోమవారం గుజరాత్‌లోని వడోదరలో టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు ఇద్దరూ కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ రోజు (సోమవారం) ఇరుదేశాధి నేతలు చారిత్రాత్మకమైన లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీలో పాల్గొననున్నారు. కాగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు చెందిన ఈ ఫెసిలిటీని సీ-95 సైనిక విమానాల తయారీ కోసం ఉపయోగిస్తారు. మన దేశంలో మొట్టమొదటి ప్రైవేటురంగ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఇదే కావడం గమనార్హం. ఒప్పందంలో భాగంగా ఈ ఫెసిలిటీలో మొత్తం 40 విమానాలను తయారు చేస్తారు. ఏవియేషన్ దిగ్గజ కంపెనీ 'ఎయిర్‌బస్' నేరుగా 16 విమానాలను భారత్‌కు అందించనుంది. టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీ ప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. సైనిక విమానాల తయారీ కోసం భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రైవేట్ రంగ ప్లాంట్ ఇదేనని తెలిపింది. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ భారత్‌లో 40 విమానాలను తయారు చేసే బాధ్యతలు తీసుకుంటుంది. ఈ ఫెసిలిటీ దేశంలోనే తొలి ప్రైవేట్ సెక్టార్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌గా నిలిచింది. తయారీ నుంచి అమరిక వరకు సమస్త వ్యవస్థ ఇక్కడే ఉంటుంది. విమానాలను టెస్టింగ్ చేయడం నుంచి డెలివరీకి అవసరమైన అర్హత ప్రమాణాలను కూడా ఇక్కడే నిర్వహిస్తారు" అని పేర్కొంది. కాగా టాటా కంపెనీలతోపాటు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రైవేట్ రంగానికి చెందిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు కూడా తమ సహకారాన్ని అందించనున్నాయి. కాగా వడోదరలో ఏర్పాటు చేసిన ఫైనల్ అసెంబ్లీ లైన్‌కు అక్టోబర్ 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యి అందుబాటులోకి రావడంతో ఇవాళ ప్రారంభించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com